నవతెలంగాణ 1
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
సోమవారం | ఏప్రిల్ 01, 2024 | www.navatelangana.com

పునరుత్థానం చాటాలి

ఫాదర్ కాసు మర్రెడ్డి
ఘనంగా ఈస్టర్ పర్వదినం..



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

యేసుక్రీస్తు పునరుత్థానాన్ని చాటాలని ఫాతిమా కెథిడ్రల్ చర్చి ఫాదర్ కాసు మర్రెడ్డి కోరారు. కాజీపేట ఫాతిమా కెథిడ్రల్ చర్చి ఆవరణలో శనివారం అర్ధరాత్రి 10.30 గంటలకు ప్రారంభమైన పాస్కా జాగరణ మహెూత్సవం ఆదివారం వేకువజామున 2.30 గంటల వరకు కొనసాగింది. ఈ దివ్య బలి పూజలో ఫాదర్ కాసు మర్రెడ్డి పునరుత్థాన క్రీస్తు స్వరూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రైస్తవుడు పునరుత్థానాన్ని కోరుకోవాలని, ఇందుకు క్రీస్తు భోదనలను అనుసరించాలన్నారు. పాస్కా జాగరణ మహెూత్సవంలో భాగంగా జ్యోతి అర్చన, దైవ వాక్యార్చన, జ్ఞాన స్నానార్చన, కృతజ్ఞతార్చన నాలుగు భాగాలుగా పూజను నిర్వహించారు. జ్యోతి అర్చనలో భాగంగా అందరూ కొవ్వత్తులు వెలిగించి యేసు క్రీస్తు పునరుత్థానాన్ని కొనియాడారు. జ్ఞాన స్నానార్చనలో జ్ఞాన స్నాన నూతీకరణ చేయించారు. ఫాదర్ కాసు మర్రెడ్డి ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈస్టర్ ప్రత్యేక ప్రార్ధనలో సుమారు 2,500 మంది క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ పూజలో ఈస్టర్ సందర్భంగా ఫాదర్ కాసు మర్రెడ్డి, చర్చి కమిటీ సభ్యులు కేక్ కట్ చేశారు. ఈ ప్రార్ధనలో ఫాదర్ అర్లగడ్డ ప్రకాశ్, సిస్టర్లు, బ్రదర్లు తదితరులు పాల్గొన్నారు.

పునరుత్థాన ప్రభావం పొందాలి : ఫాదర్ కరుణాకర్

పునరుత్థాన ప్రభావాన్ని ప్రతి క్రైస్తవుడు పొందాలని ఫాతిమా కెథిడ్రల్ చర్చి సహాయ విచారణ గురువు ఫాదర్ కరుణాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఫాతిమా కెథిడ్రల్ చర్చిలో ఈస్టర్ పూజను ఆయన సమర్పించారు. 40 రోజుల పాటు ఉపవాస ప్రార్ధనలను ఆచరించి ఈస్టర్ పండుగలో ప్రార్ధనలో పాల్గొన్న వారందరికి ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈస్టర్ కేక్‌ను ఫాదర్ కరుణాకర్, చర్చి కమిటీ పెద్దలతో కలిసి కట్ చేశారు.

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో..

బీఆర్‌ఎస్‌కు అభ్యర్థి కొరత

ఎటూ తేల్చుకోలేకపోతున్న అధిష్టానం

బీఆర్‌ఎస్‌లోకి 'తాటికొండ' రీ ఎంట్రీ.. ?



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో పోటీ చేయడానికి బీఆర్‌ఎస్ పార్టీకి అభ్యర్థి కరువవడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య పేరును ఖరారు చేశాఖ ఆమె బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం ఆ పార్టీకి గట్టి షాక్ తగిలినట్టయ్యింది. బిఆర్‌ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య పేరును ఖరారు చేయకముందే ఆ పార్టీలో పలు కీలక పరిణామాలు జరిగి డాక్టర్ టి. రాజయ్య, సిట్టింగ్ ఎంపీ దయాకర్ కాంగ్రెస్‌లో చేరిపోగా, మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు అరూరి రమేష్ బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. వీరు ముగ్గురు బిఆర్‌ఎస్ పార్లమెంటు టికెట్‌నాశించిన వారే. వరంగల్ పార్లమెంటు బిఆర్‌ఎస్ అభ్యర్థి కోసం పార్టీ తీవ్రంగా అన్వేషిస్తుంది. ఈ క్రమంలో పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను మళ్లీ పార్టీలోకి చేర్చుకొని పార్టీ టికెట్ ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ పార్ల మెంటు నియోజకవర్గంలో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. బీఆర్‌ఎస్ పార్టీ టికెట్ ఖరారుకు ముందు, ఖరారు తరువాత ఆసక్తి కరమైన పరిణామాలు జరిగాయి. బిఆర్‌ఎస్ టికెట్‌నాశించి భంగపడ్డ సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌లు వేర్వేరుగానే బీఆర్‌ఎస్‌ను వీడారు. ఎంపీ దయాకర్, డాక్టర్ టి. రాజయ్యలు వేర్వేరుగానే కాంగ్రెస్‌లో చేరగా, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీజేపీలో చేరారు. 'అరూరి'ని బిజెపి అభ్యర్థిగా ఆ పార్టీ ప్రకటించింది. సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ కాంగ్రెస్ టికెట్‌నాశించారు. తాజాగా బీఆర్‌ఎస్ సీనియర్ నేత, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కూతురు కావ్య కాంగ్రెస్‌లో చేరడంతో సీన్ రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ టికెట్‌నాశించి ఆ పార్టీ ముందు చేరిన వారికి ఈ తాజా పరిణామం మింగుడుపడడం లేదు.

బీఆర్‌ఎస్‌కు అభ్యర్థి కరువు

అభ్యర్థిత్వం ప్రకటించాక డాక్టర్ కావ్య పోటీ చేయలేనని లేఖ రాసి తప్పుకొని కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్ పార్టీకి అభ్యర్థి కరువయ్యారు. ఈ పరిణామాల నుండి తేరుకోవడానికి బీఆర్‌ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తుంది. ఆ పార్టీ టికెట్‌ను పలువురు ఉద్యమకారులు ఆశిస్తున్నా, వారికి పార్టీ నాయకత్వం ఇచ్చే అవకాశం కనిపించడం లేదు. వరంగల్ అర్బన్ జిల్లా జడ్పీ ఛైర్మన్ డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్ మాత్రమే 'మాదిగ' సామాజిక వర్గానికి చెందిన నేత వున్నారు. ఉద్యమకారులుగా మాజీ కార్పొరేటర్లు పలువురు పార్టీ టికెట్‌నాశి స్తున్నారు. బలమైన అభ్యర్థుల కోసం పార్టీ అన్వేషి స్తున్నట్లు తెలుస్తుంది.

బీఆర్‌ఎస్‌లోకి 'తాటికొండ' రీ ఎంట్రీ..?

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం బీఆర్‌ఎస్ టికెట్ విషయంలో తలెత్తిన పరిణామాలతో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య బీఆర్‌ఎస్‌ను వీడారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడ్డ 'తాటికొండ', ఎమ్మెల్యేగా కడియం శ్రీహరి గెలిచాక రాజకీయాలకు దూరంగా వుంటూ వచ్చారు. వరంగల్ పార్లమెంటు టికెట్ విష యంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కాంగ్రెస్‌లో చేరడంతో 'తాటికొండ' పునరాలోచనలో పడ్డట్టు తెలుస్తుంది. బీఆర్‌ఎస్‌లో చేరడానికి ఆయన సుముఖంగా వున్నట్లు సమాచారం. ఇదిలావుంటే వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం నుండి డాక్టర్ టి. రాజయ్యను బరిలోకి దింపితే ఎలా వుంటుందనే విషయంలోనూ పార్టీ తీవ్రంగా ఆలోచి స్తున్నట్లు సమాచారం. ఎవరూ ముందు కురాని పక్షంలో 'తాటికొండ'ను పార్టీలోకి చేర్చు కొని మళ్లీ బరిలోకి దింపే అవకాశాలు మెండుగా వున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతుంది. ఏదేమైనా 'కడియం' బీఆర్‌ఎస్‌ను వీడడంతో ఆ పార్టీ కాకవికలమైంది. నష్ట నివారణకు ప్రయ త్నిస్తున్నా ప్రత్యామ్నాయం కరువవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కడియం

కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కావ్య ?

-త్వరలోనే ప్రకటన -ఆశావహులకు షాక్..

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి దీపా దాస్ మున్షీ సమక్షంలో బీఆర్‌ఎస్‌కు చెందిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు డాక్టర్ కావ్య కాంగ్రెస్‌లో చేరారు. ఆదివారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కడియం శ్రీహరి, కావ్యకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి, సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. పలు రాజకీయ అంశాలపై వారిద్దరూ చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున 'కడియం' అనుచరులు వాహనాల్లో హైద్రాబాద్‌కు చేరుకున్నారు. వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య పేరును త్వరలోనే ఖరారు చేయనున్నారని ప్రచారం జరుగుతుంది. ఆదివారం రాత్రి లేదా సోమవారం ఉదయం కావ్య అభ్యర్థిత్వాన్ని ఏఐసీసీ అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలుస్తుంది. 'కడియం' కాంగ్రెస్‌లోకి ఆహ్వానించడాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి సింగాపురం ఇందిరా వ్యతిరేకించడం, ఆమె అనుచరులు హైద్రాబాద్‌లోనూ నిరసనలకు దిగిన విషయం విదితమే. ఈ క్రమంలో వారితో కాంగ్రెస్ నేతలు చర్చలు జరిపి పరిస్థితి చక్కదిద్దారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సీనియర్ నేత కడియం శ్రీహరి, ఆయన కుమార్తె డాక్టర్ కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం ఉదయం హైద్రాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి స్వగృహంలో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, ఏఐసీసీ కార్యదర్శి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో 'కడియం' అనుచరులు సైతం పాల్గొన్నారు. గత మూడ్రోజులుగా జరుగుతున్న నాటకీయ పరిణామాలకు ఆదివారం తెరపడింది.

సరైన సమయంలో సరైన నిర్ణయం..

బీఆర్‌ఎస్‌ను వీడి, కాంగ్రెస్‌లో చేరడంపై 'కడియం'పై బీఆర్‌ఎస్ నేతలు పలువురు విమర్శలు ఎక్కుపెట్టినా, 'కడియం' సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారన్న వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగి ఓడిపోవడం కంటే కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడి గెలిచి ఎంపీగా పార్లమెంటుకు వెళ్లడం సరైందని 'కడియం' భావించారు. ఈ క్రమంలోనే వచ్చిన అవకాశాన్ని తన కుమార్తె రాజకీయ భవితవ్యానికి భరోసా ఇచ్చారు. కాంగ్రెస్‌లోకి 'కడియం' చేరికతో వరంగల్ పార్లమెంటు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఖాళీ అయిందనే చెప్పాలి. ఈ పార్లమెంటు నియోజకవర్గంలోని 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేవలం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాత్రమే బీఆర్‌ఎస్ గెలిచింది. ఇప్పుడు 'కడియం' కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



కాంగ్రెస్ అభ్యర్థిగా కావ్య..

వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య పేరును ఏఐసీసీ త్వరలోనే ఖరారు చేసే అవకాశమున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కూతురు కావ్య కాంగ్రెస్‌లో చేరడంతో ఇప్పటి వరకు వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ ఖరారును పెండింగ్‌లో పెట్టిన పార్టీ నాయకత్వం వెంటనే అభ్యర్థిత్వాన్ని ప్రకటించే అవకాశముంది. ఆదివారం రాత్రి లేదా సోమవారం కావ్య అభ్యర్థిత్వాన్ని ప్రకటించే అవకాశముంది.

ఆశావహులకు షాక్..

వరంగల్ పార్లమెంటు టికెట్‌ను ఆశించిన పలువురు కాంగ్రెస్ నేతలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య కాంగ్రెస్‌లో చేరడం షాకిచ్చింది. వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్‌ను కాంగ్రెస్‌లోని సింగాపురం ఇందిర, సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, దొమ్మాటి సాంబయ్య, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్‌తో పాటు పలువురు నేతలు ఆశించారు. వీరి ఆశలపై నీళ్లు చల్లినట్టయ్యింది. 'కడియం' చేరికపై కాంగ్రెస్‌లో కొంత మంది నేతలకు అసంతృప్తి ఉన్నా రాష్ట్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయానికి ఏఐసీసీ నేతల ఆశీస్సులుండడంతో చేసేదేమి లేక మౌనంగా వుండిపోయారు. ఏదేమైనా 'కడియం' కాంగ్రెస్‌లో చేరడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు కేవలం జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాత్రమే మిగిలారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

నవతెలంగాణ-గీసుగొండ

బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వారి ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఘటన నర్సంపేట-వరంగల్ రహదారిపై మండలంలోని మచ్చాపురం గ్రామంలోని ఆదివారం చోటు చేసుకుంది. నర్సంపేటకు చెందిన మడికొండ ప్రభాకర్(27) ఇమ్మడి శామ్యూల్ (20)అనే ఇద్దరు వ్యక్తులు వరంగల్‌లోని వారి బంధువుల ఇంటికి శనివారం ద్విచక్ర వాహనం వెళ్లి ఆదివారం ఉదయం వరంగల్ నుండి నర్సంపేటకు వస్తుండగా మచ్చాపురం వద్ద నర్సంపేట వైపు వెళుతున్న ఎడ్ల బండిని ఢీ కొట్టి రహదారిపైన పడిపోయారు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం వీరు ఇరువురుపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని అన్న మడికొండ రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు గీసుగొండ సీఐ పవన్‌కుమార్ తెలిపారు.



గురుకులాల రద్దు ఆలోచనను విరమించుకోవాలి

నవతెలంగాణ-పర్వతగిరి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న(సీఓఈ) గురుకులాలను రద్దు చేసే ఆలోచనను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్‌కుమార్ అఖిలభారత రైతు సంయుక్త సభ వరంగల్ జిల్లా కన్వీనర్ మల్లెపాక చంద్రమౌళి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున సి ఓ ఇ పాఠశాలలో మేధావులు విద్యావేత్తలు గొప్పగొప్ప ఆలోచనలు చేసే ప్రయోగాత్మకంగా ప్రత్యేకంగా అట్టడుగు స్థాయి నిరుపేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఏర్పాటుచేసిన సీఓఈలను రద్దు చేసే ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. సీఓఈలను రద్దు చేయడం అంటే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డి సురేష్, కే శేషునాథ్ పాల్గొన్నారు.

ఎస్సై వెంకన్న కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-పర్వతగిరి



పర్వతగిరి ఎస్సైగా బాధ్య తలు చేపట్టిన గుగు లోత్ వెంకన్న నాయక్‌ను యువకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలు వాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు బట్టు నగేష్, దబ్బేట కరుణాకర్, దబ్బేట అనిల్, వీరన్న, బద్రు, నరసింహ,సురేష్ పాల్గొన్నారు.

కేశవాపురం పెద్దగుట్ట @ మరో కేజీఎఫ్

- గుట్టపై రాబంధుల్లా వాలిన మైనింగ్ మాఫియా
- నిబంధనలను ఉల్లంఘిస్తూ మైనింగ్‌కు యత్నం
- పెద్దగుట్టను కాపాడుకునేందుకు యువత ముందుకు
- పోలీస్ కేసులను సైతం లెక్కచేయని గ్రామస్తులు



నవతెలంగాణ-రాయపర్తి

నాలుగు గ్రామాల ప్రజలు ఐదేండ్లుగా పెద్దగుట్టపై మైనింగ్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నారు.. గుట్టను కాపాడుకోవడమే ధ్యేయంగా యువత నిర్విరామంగా ధర్నాలు చేస్తున్నారు. స్థానికులు పోలీస్ కేసులను సైతం లెక్క చేయకుండా కటకటాల పాలైన బాధను పంటి కింద బిగబట్టి రెట్టింపు భావోద్వేగంతో గుట్ట సంరక్షణకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు...అయినా మైనింగ్ మాఫియా గుట్టపై రాబంధుల్లా వాలి కేజీఎఫ్ తరహాలో సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడానికి బీస్మిచ్చుకు కూర్చున్న పరిస్థితి నెలకొంది. అటు నాలుగు గ్రామాల ప్రజలు, ఇటు మైనింగ్ మాఫియా గుట్టపై గట్టి పట్టు పట్టడంతో మండల ప్రజల్లో అనేక రకాల అనుమానాలు రేకెత్తుతున్నాయి.

వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని కేశవపురం గ్రామానికి ఆనుకునే ఉండే పెద్దగుట్ట ఇటు కేశవపురం, అటు ఆరెగూడెం, కొలనుపల్లి, జయరాం తండా గ్రామాలకు గుండెకాయ వంటిది. సర్వే నెంబర్ 132లో 197 ఎకరాల్లో ఉండే గుట్ట జీవవైవిధ్యానికి నిలువెత్తు నిదర్శనం... వర్షాకాలంలో గుట్టపై నుంచి వచ్చే నీటితో చుట్టూ పక్క ఉండే చెరువులు, కుంటలు నిండుకుండలా నిండి మత్తళ్లు పడి పరవళ్లు తొక్కుతుంటాయి. వేలాది ఆయుర్వేద మొక్కలను, అరుదైన చెట్లను తనుపై పెంచుకుంటుంది, వేల సంఖ్యలో పశువులకు కడుపు నింపుతుంది. ఎండాకాలం ఇతరత్ర ఎలాంటి పరిస్థితుల్లోనైనా జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి పెద్ద గుట్ట 400ఏండ్లుగా ప్రేమించే పెద్దమ్మల నిలుస్తూ తమను కాపాడుతుందని నాలుగు గ్రామాల ప్రజలు పెద్దగుట్ట ప్రాముఖ్యతను 'నవతెలంగాణ'కు తెలుపుతూ గుట్టను కాపాడుకొని భావితరాలకు అందిస్తామని మడమ తిప్పని మనో ధైర్యంతో తెలుపుతున్నారు.

ప్రజా అభిప్రాయానికి విరుద్ధంగా మైనింగ్...

పెద్దగుట్టపై మైనింగ్ అనుమతులను ఇవ్వడానికి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టలేదని స్థానికులు తెలుపుతున్నారు. గుట్టపై యాదవుల ఆరాధ్య దైవం లింగమంతుల స్వామి ఆలయం ఉందన్నారు. గుట్టకు సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రభుత్వ పాఠశాల, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రైతు వేదిక, నర్సరీ, రెండు వాటర్ చెక్ డ్యాములు ఉన్నప్పటికీ అధికారులు ముడుపులకు ఆశపడి అధికారులు మైనింగ్‌కు అనుమతులు ఇవ్వడం హేయమైన చర్య అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుట్టపై ఓం శ్రీ సాయి గ్రానైట్ (కలర్ గ్రానైట్) నిర్వాహకులు పర్యావరణ అనుమతులు లేకుండానే పనులు చేపట్టినట్లు ప్రజలు తెలుపుతున్నారు. మట్టిగుట్ట అయిన పెద్దగుట్టపై (పాలిరైటిక్ స్టోన్) కలర్ గ్రానైట్ ఉందని దీంతో రూ.కోట్ల వ్యాపారం చేయొచ్చని మైనింగ్ మాఫియా సామవేద దండోపాయాలతో ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నారు. గుట్టపై 5హెక్టార్ల తవ్వకాలు జరిపి గ్రానైట్ వెలికి తీసేందుకు 2019లో ఓ గుత్తేదారు మైనింగ్ శాఖ నుంచి 20ఏళ్లకు అనుమతి తెచ్చుకున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి, మైనింగ్ శాఖల నుంచి ప్రతి అయిదేళ్లకోసారి పలు రకాల అనుమతులు తీసుకోవాలి. గడువు పూర్తయినా ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టపై వందలాది పచ్చని చెట్లను నరికేసి పైకి పెద్ద రహదారి నిర్మించినట్లు స్థానికులు సాక్షాదారాలతో తెలుపుతున్నారు. పూర్తి నివేదిక ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు వస్తున్నారు..పోతున్నారు తప్ప ఏ చర్యలు తీసుకోవడంలదేని ప్రజలు అధికారుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసు కేసులను సైతం లెక్కచేయని గ్రామస్తులు...

మైనింగ్ మాఫియా రోజుల వ్యవధిలోనే భారీ జెసిబిలతో గుట్ట కింద నుండి మొదలు పైవరకు వందలాది చెట్లను తొలగిస్తూ బాట (ర్యాంపు) తీశారు. దాంతో చెల్లించి పోయిన స్థానికులు పర్యావరణ పరిరక్షణ సమితిగా ఏర్పడి శాంతియుత ధర్నాలు చేపట్టారు. రోజురోజుకు మైనింగ్ తీవ్ర రూపం దాల్చడంతో కోపోద్రొక్తులైన స్థానికులకు అప్పటి ప్రజాప్రతినిధి రెచ్చగొట్టే మాటలు చెప్పడంతో కొందరు జేసీబీ ఇతరత పరికరాలను పాక్షికంగా ధ్వంసం చేయడంతో మైనింగ్ మాఫియా వారిపై పోలీస్ కేసులు పెట్టింది. విద్యావంతులు, యువత, రైతులపై కేసులు పెట్టడంతో 105 / 2001 ఎఫ్ఐఆర్ ప్రకారం 33మంది 15 రోజులు ఖమ్మం జైలులో ఊచలు లెక్క పెట్టారు. అయినప్పటికీ వారు భయపడకుండా తాము చివరి వరకు గుట్ట పరిరక్షణ కోసం పాటుపడతామని ముందుకు వచ్చారు. ఇలా ఇప్పటి వరకు మైనింగ్ మాఫియా పైరవీలను, ఆగడాలను తిప్పికొడుతూ ఓరుగల్లు ఉద్యమ స్ఫూర్తిని రేకెత్తిస్తున్నారు.

ఝాన్సీరెడ్డి హుకుం జారీతో నిలిచిన మైనింగ్...

నిరంకుశ పాలను వ్యతిరేకిస్తూ, నవతరం యువతకు రాజకీయ అవకాశాలు కల్పిస్తూ, అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఝాన్సీ రాజేందర్‌రెడ్డి మైనింగ్ నిలిపి వేయాలని హుకుం జారీ చేయడంతో క్షణాల్లోనే కాంగ్రెస్ ముఖ్య నాయకులు గుట్ట వద్దకు వెళ్లి మైనింగ్‌ను అడ్డుకున్నారు. ఇది ప్రజా స్వామ్యం అని ప్రజల ఇష్ట ప్రకారమే పనులు జరగాలని, అలా కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్టు సమాచారం.

గుట్ట రక్షణ కోసం పాటుపడతా : జక్కుల రాజు : పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు

చివరి వరకు పెద్దగుట్ట సంరక్షణ కోసం పాటుపడుతా. మైనింగ్ మాఫియా పెద్దగుట్టను ధ్వంసం చేయడానికి ప్రయత్నించడం సరికాదు. పర్యావరణాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మైనింగ్ పేరుతో ప్రకృతిని కాకా వికలం చేసేందుకు ప్రయత్నించడం బాధాకరం. ఇప్పటికీ కేసుల పాలైన అయినప్పటికీ పెద్దగుట్ట రక్షణకు శాయ శక్తులా ప్రయత్నిస్తా.



పెద్దగుట్టకు ప్రజలకు విడదీయరాని బంధం ఉంది : చిదుముల్ల కష్ణ (పిపిఎస్ ముఖ్య నాయకుడు)

పెద్దగుట్టకు ప్రజలకు తరత రాలుగా విడదీయరాని బంధం ఉంది. పెద్దగుట్టను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత. మైనింగ్ మాఫియాను పెద్ద గుట్ట నుండి తరిమి కొట్టేంత వరకు పోరాడుతాం. విద్యావంతులు, యువత, రైతులు ఒకటై పెద్దగుట్ట పరిరక్షణకు పాటుపడుతున్నాము. ప్రజాప్రతినిధులు సైతం స్థానిక ప్రజానీకానికి సహకరించి గుట్టపై మైనింగ్ ను శాశ్వతంగా నిలిపివేయాలి.



ఉన్నత విద్య అభ్యసించి భావి భారత పౌరులుగా ఎదగాలి

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నవతెలంగాణ- నర్సంపేట

విద్యార్థులందరూ ఉన్నత విద్యను అభ్యసించి భావి భారత పౌరులుగా ఎదగాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ విజ్ డమ్ స్కూల్లో శనివారం జరిగిన స్కూల్ గ్రాడ్యుయేషన్, ఆన్యువల్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై మాట్లాడారు. ఆ సరస్వతి దేవి ఆశీస్సులతో చిన్నారులందరి జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని అదే విధంగా విద్య ద్వారానే సమాజం అభివద్ధిని సాధిస్తుందనీ, విద్య ద్వారానే విద్యార్థులు అందరూ



సంస్కారవంతులుగా సమాజంలో తయారవుతారన్నారు. విద్య గౌరవాన్ని పెంచడంతో పాటు, విద్య ప్రతి ఒక్కరిని సమాజంలో అత్యున్నత స్థాయిలో నిలబెడుతున్నందున విద్యార్థులందరూ ఉన్నత విద్యను అభ్యసించి బావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విజ్ డమ్ హైస్కూల్ చైర్మన్ ఎస్ డీ జహంగీర్, డైరెక్టర్ జావేద్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల ,పట్టణ నాయకులు పాల్గొన్నారు..

న్యూరో ఆసుపత్రి ప్రారంభం

పట్టణంలో పరిధిలో నూతన నర్సంపేట న్యూరో ఆసుపత్రిని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. ఆదివారం నెక్కొండరోడ్‌లో న్యూరో ఫిజిషన్ డాక్టర్ ఎం. అమతరెడ్డి నేతత్వంలో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిని ప్రారంభించి మాట్లాడారు. నర్సంపేట ప్రాంతంతో పాటు సమీప ఏజెన్సీ గ్రామాల ప్రజలకు మెరుగైన ఆధునిక వైద్యం అందించాలనే లక్ష్యం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాయిడి కీర్తి దుష్యంత్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి తక్కెళ్లపెల్లి రవీందర్ రావు, కౌన్సిలర్ వేముల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 2

నమ్మిన తెలుగు దినపత్రిక

హనుమకొండ

సోమవారం | ఏప్రిల్ 01, 2024 | www.navatelangana.com

మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పెద్దకోడపాక గ్రామంలోని మైదంకుంటలో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, రెవెన్యూ, పోలీస్ అధికారులు మట్టి తవ్వకాలపై తగిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మంద సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగుల పవన్‌కళ్యాణ్‌తో కలిసి మైదంకుంటను సందర్శించి పరిశీలించారు. మైదాంకుంటలో ఇదివరకే ఒక కాంట్రాక్టర్ అధికంగా మట్టి తవ్వకాలు జరిపారని, మళ్లీ అదే కుంటలో తవ్వకాలు జరుపుతున్నారని, దానికి ఇరిగేషన్ అధికారులు పర్మిషన్ ఇచ్చారని, పర్మిషన్ మేరకే తవ్వకాలు జరుపుతున్నామని బెదిరిస్తున్నట్లు తెలిపారు. ఇలా కుంటల్లో తవ్వకాలు జరపడానికి కాంట్రాక్టర్‌కి పర్మిషన్ ఇవ్వడం వెనుకాల అంతర్యామేమిటో తెలియట్లేదని అన్నారు. తవ్వాకాలకు 3ఫీట్‌ల వరకే పర్మిషన్ ఇస్తారని, 10ఫీట్‌ల మేరకు తవ్వుతున్నారని అన్నారు. ఈ దారి గుండానే రైతులు రాకపోకలు జరుపుతారని, దారి పక్కనే ఈ తవ్వకాలు జరపడం వల్ల పశువులు, రైతులు మత్యువాత పడే అవకాశం ఉందని అన్నారు. రాత్రి వేళల్లో మొరాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా



ఉన్నతాధికారులు స్పందించి మైదంకుంటను సందర్శించి ఎంత మేర మట్టి తవ్వకాలు జరుగుతున్నాయో చూడాలని, తవ్వకాలను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాజు, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

కేయూ బడ్జెట్ రూ.431.20 కోట్లు

ఆమోదించిన అకాడమిక్ సెనెట్ సమావేశం

విశ్వవిద్యాలయం అభివద్ధిలో అందరి కషి

వీసీ ఆచార్య తాటికొండ రమేష్

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

కాకతీయ విశ్వ విద్యాలయం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.431,20కోట్ల అంచనా బడ్జెట్ ప్రతిపాదించింది. ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షతన విశ్వ విద్యాలయం సెనెట్ హాల్‌లో జరిగిన 30వ అకడమిక్ సెనెట్ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్, డీన్ ఆచార్య పి.అమరవేణి బడ్జెట్ ప్రవేశపెట్టారు. యేడాది పాటు ఉద్యోగుల వేతనాలు, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్లు, ఉద్యోగ విరమణ భత్యాలు, ఇతర ఖర్చులకు రూ. 449,73కోట్లు కేటాయించారు. మొత్తం బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ.134,94కోట్లు, ఇతర వనరుల నుంచి రూ.296.26కోట్లు రాబడి వస్తుందని అంచనా వేశారు. వీటిలో యూజీసీ నుంచి బకాయిల రూపంలో రూ.32.81కోట్లు, ఆకడమిక్, ట్యూషన్ ఫీజు రూపంలో రూ.8కోట్లు, అంతర్గత వనరుల ద్వారా రూ.24.28కోట్లు, పరీక్షల విభాగం ద్వారా రూ.58.79కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఖర్చులను, రాబడులను ఆచార్య అమరవేణి ఎనిమిది అంశాల్లో చూపించారు. అదే సవ ంయంలో రూ.8.08నోట్లు లోటు ఉంటుందని వెల్ల డించారు. రుసా నిధులు రూ.44కోట్లు వస్తాయని అంచనా చేశారు. ఉద్యోగుల జీతాలకు, పెన్షన్లకు రూ.207.44 కోట్లు, పరీక్షలు, ఆకడమిక్ కార్యక్రమాలకు రూ. 63.44కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు.

విశ్వవిద్యాలయం అభివద్ధిలో అందరి కృషి

విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అందరి కషి ఉందని వైస్ చాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ తన నివేదికలో పేర్కొన్నారు. న్యాకె ఏప్లస్ గ్రేడింగ్ సాధించడం ఒక గొప్ప అంశమని అన్నారు. అందుబాటులో ఉన్న పరిమిత వనరులు, రాష్ట్ర ప్రభుత్వ ఇతర సంస్థల సహకారంతో అకడమిక్, పరిపాలన, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగుల సంక్షేమం, ఇతర అభి వద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు



తెలిపారు. కెహబ్, పీవీ విజ్ఞాన కేంద్రం, పరిపాలన భవన్లో రెండోఅంతస్తు, డైనింగ్ హాల్, బాలికల వసతి గహం విస్త రణ, దూర విద్య కేంద్రంలో మీడియా సెంటర్ పున రుద్దరణ అభివద్ధి పనుల్లో ఉన్నాయన్నారు.

ప్రపంచ, జాతీయ స్థాయి సంస్థలతో అవగాహన ఒప్పందాలు

అకడమిక్‌రంగా ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలతో, జాతీయ స్థాయి సంస్థలతో అవగాహన ఒప్పందాలు, జాయింట్ రిసెర్చ్ ప్రోగ్రామ్‌లు, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీ పరీక్షకు శిక్షణ చేపట్టి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొందటంలో ప్రోత్సాహం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై 40రోజుల శిక్షణా కార్యక్రమంతో పాటు ఐదేళ్ల విరామం తర్వాత పీహెచ్డీ ప్రవేశాలు విజయంతంగా నిర్వ హించినట్లు వీసీ వివరించారు. రాష్ట్రపతి, గవర్నర్ నుంచి అవార్డులు పొందినట్లు తెలిపారు. మూడు దశాబ్దాల విరామం తర్వాత ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించామని, విభాగాలు, కళాశాలల్లో కూడా అంతర్జాతీయ, జాతీయ సదస్సులు నిర్వహించామన్నారు.

విశ్వవిద్యాలయ ఉద్యోగుల సంక్షేమం

విశ్వవిద్యాలయ ఉద్యోగుల సంక్షేమం కోసం పలు చర్యలు తీసుకున్నట్టు వీసీ ఆచార్య రమేష్ తెలిపారు. దినసరి వేతన ఉద్యోగుల జీతాలు పెంచినట్లు తెలిపారు. క్యాజువల్ ఉద్యోగుల వేతనాలు కూడా త్వరలో పెరుగు తాయన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన భత్యాలు, రెగ్యులర్ ఉద్యోగుల పిఆర్సి బెనిఫిట్స్ చెల్లించామన్నారు. గవర్నర్ ఆర్డర్ల ప్రకారం పార్టైమ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు రెమ్యునరేషన్లు పెంచామన్నారు. పరిమిత, నియమిత ఆర్థిక, మానవ వనరులతో సమష్టి కృషితో ముందుకు పోతున్నామన్నారు

జాబ్ ఓరియంటెడ్ కోర్సులు ప్రవేశ పెట్టాలి

పూర్వపు వైస్ ఛాన్సలర్ ఆచార్య వి. గోపాల్‌రెడ్డి మాట్లా డుతూ, జాబ్ ఓరియంటెడ్ కోర్సులు ప్రవేశ పెట్టాలని, ప్రభుత్వం నిధులు, నియామకాలకు ముందుకు రావాలని, దూర విద్యాకేంద్రంలో నూతన కోర్సులు ప్రవేశపెట్టాలని అన్నారు. పూర్తిస్థాయి ఆకాడమిక్ సెనెట్ ఉండాలన్నారు. ఆచార్య విద్యావతి మాట్లాడుతూ, పలు విభాగాల్లో రెగ్యులర్ అధ్యాపకుల కొరత చాలా ఉందని అన్నారు. పరిశోధనలు నిరంతరం జరగాలని, పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కావొద్దని, నిధులను సమీకరించాలన్నారు. అకడమిక్ సెనెట్ సభ్యుడు డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని విచారం వ్యక్తం చేశారు. గ్రాంట్స్ పెరగడం లేదని అన్నారు. యూనివర్సిటీలు బాగుపడాలంటే నియామకాలు జరగాలని అభిప్రాయపడ్డారు. న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ రావడం అభి నందనీయం అన్నారు. మరో అకడమిక్ సెనెట్ సభ్యుడు మాణిక్యం మాట్లాడుతూ.. యూనివర్సిటీ పాలనలో మహిళా నాయకత్వం పెరగడం అభినంద నీయం అన్నారు. ప్రత్యేక ఆహ్వానితుడు, విశ్రాంత ఎకానమిక్స్ విభాగ ఆచార్యులు, శాతవాహన యూని వర్సిటీ మాజీ వైస్ ఛాన్సర్ ఆచార్య ఇక్బాల్ అలీ మాట్లాడుతూ ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని యూని వర్సిటీ ముందుకు దుసుకొని పోతున్నదన్నారు. పూర్వ విద్యార్థుల నుంచి నిధులు రాబట్టాన్నారు. డీన్లు ఆచార్య ఎస్.రామనాథ్ కిషన్ మాట్లా డుతూ. గెస్ట్ ప్యాకల్టీ నియామకంతో విద్యా విభాగం బలోపేతమైందన్నారు. స్నాతకోత్సవం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఆచార్య మనోహర్ మాట్లాడుతూ.. సమష్టి కషితో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ విజయ వంతమైందన్నారు. ఆచార్య సురేషాల్ ఆచార్య పి.వరలక్ష్మి, ఆచార్య ఎస్.జ్యోతి, ఆచార్య ఎస్. నరసింహారావు మాట్లాడుతూ అనంతరం సమావేశం బడ్జెట్ ను ఏకగ్రీవంగాఆమోదించారు.

వార్షిక నివేదికలకు ఆమోదం

వార్షిక నివేదికలను కూడా సెనెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి తన ప్రారంభోపన్యాసంలో విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్రంలోనే ఇతర విశ్వవిద్యాలయాల కంటే మెరుగ్గా ముందుకు పోతోందన్నారు. పరీక్షల విభాగంలో చేపట్టిన సంస్కరణలను వివరించారు. ఇటీవల మతి చెందిన ఆకడమిక్ సెనెట్ సభ్యుడు పోకల చందర్ ఆకాల మరణానికి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపింది. విశ్వవిద్యా లయం ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ పథ్వీరాజ్ దశ్య శ్రవణ విధానం ద్వారా మూడేళ్లలో విశ్వవిద్యా లయంలో చేపట్టిన వివిధ అభివద్ధి కార్యక్రమాలను వివరించారు. పలువురు ప్రిన్సిపాళ్లు, డీన్లు, అడ్మిని స్టేటివ్ అధికారులు, సభ్యులు పాల్గొన్నారు. కేయూ పొలిటికల్ సైన్స్ విభాగపు బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ గడ్డం కష్ణయ్య నియమితులైనందుకు సమావేశం అభినందనలు తెలిపింది.



'అశోక్' 41వసారి రక్తదానం

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పెద్దకోడపాక గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, భారత జాగతి యువత రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్ ఆదివారం 41వ సారి రక్తదానం చేసి పలువురు నుండి ప్రశంసలు అందుకున్నారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన కలువాల సతీష్‌కు శస్త్ర చికిత్స నిమిత్తం రక్తం అవసరం ఉండడంతో అశోక్‌కు సమాచారం అందించగా వరంగల్ ఎంజీఎం సమీపంలోని మదర్ తెరిసా బ్లడ్ బ్యాంకులో అశోక్ రక్తదానం చేసి ఆదుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి తమ వంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని అన్నారు. అశోక్‌ను పరకాల సీఐ రవిరాజు అభినందించారు.



అతిథి ఆశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఈస్టర్ పండగను పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ రోడ్ లోని అతిథి మనోవికాస ఆశ్రమంలోని మానసిక వికలాంగ విద్యార్థులకు అన్నదానం చేసినట్లు దాత నాగోతు పవన్ కుమార్ తెలిపారు. ప్రపంచ మానవాళికి శాంతి స్వరూపియైన యేసుక్రీస్తు చూపించే మార్గాలు చాలా ఆదర్శంగా ఉంటాయని అందులో భాగంగా ఈస్టర్ పండగ సందర్భంగా ఆశ్రమంలోని విద్యార్థులకు అన్నదానం పండ్లు స్వీట్లను పంపిణీ చేసినట్లు పవన్ తెలిపారు. అన్నదానం చేసిన దాతలను వారి కుటుంబ సభ్యులకు ఆశ్రమ నిర్వాహకులు సుజాత కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాత పవన్ తల్లిదండ్రులు నాగోతు రాజు తేరెసమ్మ, అనిల్ పాల్గొన్నారు.



పునరుద్ధాన శక్తిమంతుడు యేసుక్రీస్తు

డాక్టర్ సంగాల పాల్సన్ రాజు

నవతెలంగాణ-ధర్మసాగర్

పునరుద్ధానం కలిగిన శక్తిమంతుడు లోక రక్షకుడు యేసుక్రీస్తు అని క్రీస్తుజ్యోతి మినిస్ట్రిస్ ఫౌండర్, అంతర్జాతీయ ప్రసంగీకులు, ప్రవక్త రెవ.డాక్టర్ సంగాల పాల్సన్ రాజు అన్నారు. మండలంలోని కరుణాపురం గ్రామంలో ఆదివారం సొసైటీ ఆఫ్ క్రైస్ట్ ఆధ్వర్యంలో క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరంలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సొసైటీ జనరల్ సెక్రటరీ రెవ.డాక్టర్ జయప్రకాశ్ గోపు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాల్సన్ రాజు మాట్లాడుతూ ప్రపంచ మానవాళి కోసం ప్రాణాన్ని అర్పించి తిరిగి లేచిన క్రీస్తు మరణాన్ని జయించారని అన్నారు. పునరుద్ధానుడైన యేసు పరలోకానికి మార్గం సుగమం చేశారని అన్నారు. ప్రజలు ప్రభువు చూపిన దారిలో పయనించి, మంచి ప్రవర్తన కలిగి, సాత్వికమైన స్వభావంతో జీవనాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు ఎంపీ బాబు మోహన్, ఇర్మియ, బ్రదర్స్, సిస్టర్స్, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.



గౌరీ శంకర దేవాలయ ప్రతిష్టాపన

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధి 55వ డివిజన్ భీమారం సాయి నగర్ కాలనీ జెండా శ్రీ హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో శ్రీ గౌరీ శంకర్ దేవాలయ ప్రతిష్టాపనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ యూత్ కమిటీ నిర్వాహకులు అటికం రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ఈనెల మార్చి 30 నుండి ఏప్రిల్ ఒకటవ తేదీ వరకు శని, ఆది, సోమవారాలలో సాయి నగర్ కాలనీ జెండా భీమారం గ్రామంలో శ్రీ గౌరీ శంకర,దుర్గ,గణేశ, సాయిబాబా పరిహార దేవత విగ్రహ ప్రతిష్టాపనలు వేదమూర్తులైన బ్రాహ్మణులచే జరుపుటకు నిర్ణయించామని తెలిపారు. భగవత్ బంధువులందరూ కార్యక్రమంలో పాల్గొని పార్వతి పరమేశ్వరుని కపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ యూత్ కమిటీ సభ్యులు అటికం శంకర్ గౌడ్, చింతల లక్ష్మణ్ యాదవ్, శివ, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని బాలిక ఆత్మహత్య

నవతెలంగాణ-దామెర


దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊరుగొండలో బాలిక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. బాలిక (15) శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయిందని బాలిక తండ్రి ఆదివారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై కొంక అశోక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



కేయూ వసతిగహాలకు నూతన సంచాకుల నియామకం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కాకతీయ విశ్వవిద్యాలయ వసతి గహాలకు నూతన సంయుక్త సంచాలకులను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు, వీటిలో ఇంజనీరింగ్ కాలేజీ బాయ్స్ హాస్టల్‌కు ఇంజనీరింగ్ కళాశాల ఒప్పంద సహాయ ఆచార్యులు డాక్టర్ జే.రామచందర్‌ను ప్రస్తుత సంయుక్త సంచాలకులు ఆర్.డి. ప్రసాద్ స్థానంలో, ఇంజనీరింగ్ కళాశాల మెస్ కు అదే కళాశాల ఒప్పంద సహాయ ఆచార్యులు డాక్టర్ ఎస్.సత్యశివ ప్రసాద్ ను, ప్రస్తుత సంయక్తసంచాలకులు ఆర్.లక్ష్మన్ నాయక్ స్థానంలో, విద్యారణ్య (న్యూ ఫార్మసీ హాస్టల్) కు ఫార్మ ఒప్పంద సహాయ ఆచార్యులు డాక్టర్ ఎల్.సూర్యనారాయణను ప్రస్తుత సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.సంగీత్ కుమార్ స్థానంలో నియమించారు. పద్మాక్షి మహిళా హాస్టల్‌కు బయో టెక్నాలజీ విభాగంలోని ఒప్పంద సహాయ ఆచార్యులు డాక్టర్ టి.రాధిక, ఇంజనీరింగ్ కళాశాల ఒప్పంద సహాయ ఆచార్యులు డాక్టర్ టి.స్వప్న, హచ్. లక్ష్మిని ప్రస్తుత సంయుక్త సంచాలకులు డాక్టర్ కే.బ్లేస్సి ప్రియాంక, ఆర్.మంజుల, కే. సుమలత స్థానంలలో నియమిస్తున్నట్టు ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు వీరిని అభినందించారు.



అసంఘటిత కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు

నవతెలంగాణ-ఆత్మకూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ సీఎస్‌సీ హెల్త్‌కేర్ సంయుక్తంగా అసంఘటిత కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షా శిబిరం నిర్వహించారు. ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో అసంఘటిత కార్మికులకు 52 రకాల వివిధ వైద్య పరీక్షలను నిర్వహించేందు కుగాను కార్మికుల నుండి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా డిస్టిక్ కో ఆర్డినేటర్ వి.హరీష్, క్యాంపు కోఆర్డినేటర్ ఎం నాగరాజు మాట్లాడుతూ కార్మికుల దగ్గర నుండి సేకరించిన రక్త నమూనాలను లేబొరేటరీలలో పరీక్షించి వారం రోజులలో సెల్ ఫోన్ ద్వారా సంక్షిప్త సమాచారం ఇవ్వబడుతుందన్నారు. అనంతరం రిపోర్ట్సను జిపి కార్యాలయంలో వద్ద తీసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఎస్సి హెల్త్ కేర్ సిబ్బంది ఎస్. కిషోర్, వి. సాయికుమార్ ,బి భరత్, ఏ సందీప్, బి.భావన ,ఎండి కరిష్మా తదితరులు పాల్గొన్నారు.

మాదిగ వాడల్లో కాంగ్రెస్ నాయకులను తిరగనివ్వొద్దు

కడియం శ్రీహరికి మాదిగలు తగిన బుద్ధి చెప్పాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ

నవతెలంగాణ- హనుమకొండ

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో మాదిగలకు స్థానం లేదని తేలిపోయిందని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు మోసం చేస్తున్నాయని, 17 పార్లమెంటు స్థానాల్లో మూడు స్థానాల్లో కూడా మాదిగలకు చోటు కల్పించని కాంగ్రెస్ పార్టీకి, మాదిగ నాయకులను అణగదొక్కుతున్న కడియం శ్రీహరికి మాదిగ జాతి తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ పిలుపునిచ్చారు . ఆదివారం హనుమకొండ హరిత హెూటల్ కన్వెన్షన్ హాల్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాదిగలను మోసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ రెండు స్థానాల్లో మాలలకు వరంగల్ స్థానంలో మాదిగ ఉపకులం చెందిన కడియం కావ్యకు టికెట్ ఇవ్వడం మాదిగలను కించపచడమే అని అన్నారు. గత నవంబర్ 11న హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభల నో కాంగ్రెస్, నో బియారీస్ అని పిలుపు నివ్వడం జరిగిందని ప్రధానంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వొద్దని మాదిగ జాతికి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగల ఓట్లు అడిగే అర్హత కోల్పోయిందని ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మూడు ఎస్సీ రిజర్వుడు సీట్లలో

నాగర్ కర్నూలు లో నూటికి 70శాతం ఉన్న మాదిగలను విస్మరించి మాల వ్యక్తికి టికెట్ ఇచ్చిందని పెద్దపెల్లిలో కూడా 75 శాతం ఉన్న మాదిగలను పక్కన పెట్టి మాదిగ ఉపకులానికి చెందిన నేత కానీ కులం చెందిన వ్యక్తిని టికెట్ కేటాయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వరంగల్‌లో నైనా మాదిగ



కులానికి చెందిన వ్యక్తికి టికెట్ కేటాయిస్తారని ఆశించామని, తన ఉద్యోగానికి రాజీనామా చేసిన దొమ్మాటి సాంబయ్యకు టికెట్ ఇస్తారని అనుకున్నామని, కానీ మాదిగ నాయకులను అణగదొక్కుతున్న కడియం శ్రీహరి తన బిడ్డకు టికెట్ కోసం సాంబయ్యను బలి చేశారని ఆరోపించారు. కడియం శ్రీహరిని చూస్తే ఊసరవెల్లి లు కూడా సిగ్గుతో తల దించుకుంటాయని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఆ పార్టీ కూలిపోతుందని వ్యంగంగా చెప్పినా కడియం శ్రీహరి తిరిగి ఆ పార్టీలోకి పోవడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదిగ పల్లెల్లోకి వస్తే గో బ్యాక్ అనే నినాదాలు ఇవ్వాలని మాదిగ జాతికి పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్‌లో ఓడిపోయిన మాదిగ ఆడబిడ్డ సింగపురం ఇందిరకు టికెట్ ఇచ్చిన బాగుండేదని కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం కూడా లేని కావ్యకు టికెట్ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ పెద్ద తప్పు చేసిందని ఎట్టి పరిస్థితులలో కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న, గద్దల సుకుమార్, ఎమ్మెస్పీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను కనుమరుగు చేయడమే లక్ష్యంగా పని చేయాలి

రైతులపై కేసీఆర్‌ది కపట ప్రేమ

చిత్తశుద్ధితో ఎన్నికల హామీలు అమలు

ప్రతి కార్యకర్తకు పెద్దన్నలా తోడుంటా...

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

నవతెలంగాణ-గీసుగొండ

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న సంక్షేమాన్ని ఓర్వలేక మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు సాగు నీళ్ల రావడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదని అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని మరియాపురం గ్రామంలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు పెంటారెడ్డి జోజిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ చేరికలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి ఆయనతో పాటు 50మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే రేవూరి, ఏఐసీసీ కమిటీ సభ్యులు కత్తి వెంకటస్వామి కాంగ్రెస్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ పరకాల నియోజ కవర్గంలోని ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీని కనుమరుగు చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మరియాపురం మాజీ గ్రామ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి మంచి మనసున్న వ్యక్తిని ప్రజాసేవకే అంకితమై రాజకీయాల్లోకి వచ్చారని కొనియాడారు. గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను లాక్కొని కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా లేకుండా వారి ఇష్టానుసారంగా వ్యవహరించారని గత ప్రభుత్వాన్ని నిందించారు. ప్రతి



కార్యకర్తకు ఒక పెద్దన్నలా ఉంటూ వారి కష్ట సుఖాలల్లో పాలుపంచుకుంటానని హామీ ఇచ్చారు. పదేండ్లు పార్టీ కోసం కష్టపడి గెలుపులో కీలక పాత్ర పోషించిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఎలాంటి అపోహలకు పోవద్దని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కోఆర్డినేటర్ గాదె దయాకర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య, కాంగ్రెస్ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి రావుల శ్రీనివాసరెడ్డి, పరకాల అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, జిల్లా నాయకులు కొండేటి కొమురారెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కూసం రమేష్, నాయకులు అల్లం మర్రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల రుద్రప్రసాద్, ఎస్.నాగరాజు, మరియాపురం గ్రామ పార్టీ నాయకులు టీ.దిలీప్ రెడ్డి,కౌడగాని మోహన్‌రావు, జాన్‌పాల్‌రెడ్డి, బిట్ల శివప్రసాద్, రాజు, నాగరాజు, దశరద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

నవతెలంగాణ-వరంగల్

నేడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. అధికారులు, సిబ్బంది పార్లమెంట్ ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి జిల్లా ప్రజలు ఫిర్యాదులను కలెక్టరేట్‌కు తీసుకురాకూడదని పేర్కొన్నారు.

బల్దియాలో...

జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున రద్దు చేస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు ఫిర్యాదులను కార్యాలయానికి తీసుకురాకూడదని సూచించారు.

కేసీఆర్ వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు



నవతెలంగాణ-కొడకండ్ల

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో పంట పరిశీలన ముగించుకొని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలో పర్యటన వెళుతున్న క్రమంలో కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామ ఎక్స్ రోడ్ వద్ద పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఎస్ఎస్ టీం ఇందిరా ఆధ్వర్యంలో కేసీఆర్ వాహనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై శ్రవణ్ కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లిలో మల్లికార్జున స్వామి కళ్యాణం

నవతెలంగాణ-లింగాలఘనపురం



మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని, శ్రీ మల్లికార్జునస్వామి కేతమ్మ, మేడాలమ్మ కళ్యాణం మహోత్సవం ఆదివారం అంగరం గవైభవంగా ఘనంగా నిర్వహించారు. ఒగ్గు పూజారులు కేమిడి శ్రీశైలం, ఎమ్మే పరుషరాములు, కేమిడి మల్లయ్య బృందం శ్రీ రేణుక ఎల్లమ్మ పట్నాలు, శ్రీ మల్లికార్జున స్వామి పట్నాలు వేసి పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కేసీఆర్ చేపట్టింది రైతులను మోసం చేసే యాత్ర

- తీహార్ జైల్లో కవితను పరామర్శిస్తే మంచిది
- ఫామ్ హౌస్‌కు పరిమితమైన కేసీఆర్‌కు రైతులు గుర్తుకు రావడం హాస్యాస్పదం
- కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లక తప్పదు
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి

నవతెలంగాణ-డెస్క్



లిక్కర్ కేసులో కోట్లాది రూపాయలు స్వాహా చేసి తీహార్ జైల్లో ఊచలు లెక్కిస్తున్న కవితను కేసీఆర్ పరామర్శిస్తే బాగుంటుందని, కేసీఆర్ చేపట్టింది రైతులను మోసం చేసే యాత్ర అని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలు హితవు పలికారు. ఆదివారం మండల కేంద్ర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పంటలు ఎండిపోతున్నాయనే సాకుతో రైతులను మరోమారు మోసం చేసేందుకు కేసీఆర్ రైతు పరామర్శ యాత్ర చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికార వ్యామోహంతో ఉన్న కేసీఆర్‌కు పదేళ్లపాటు రైతుల కష్టాలు కనిపించలేదని, ఫామ్ హౌస్కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. అధికారం కోల్పోయిన వెంటనే రైతులు గుర్తొచ్చారా..? అని ప్రశ్నించారు. లిక్కర్ కేసుతో పాటు ఫోన్ టాపింగ్ శ్రీనిధి నిధుల కేసుల్లో కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లక తప్పదని జోస్యం చెప్పారు. కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్, పాలకుర్తి, చెన్నూర్ రిజర్వాయర్లను ఎర్రబెల్లి దయాకర్ రావులు కక్కుర్తి పడ్డారు తప్ప పూర్తి చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు చేసిన పాపాలను మేము కడిగేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తవ్విన కాలువల మరమ్మత్తులు చేయకుండా పదేళ్లపాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కమిషన్ల కోసం మరమ్మతులు చేయకుండా వదిలేశారని, అట్టి కాలువలను హనుమాండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. దేవరుప్పుల మండలం ధరావత్ తండాలో 15 గుంటల పొలం ఎండిపోతే భూతద్దంలో పెట్టి చూస్తున్నారని, 15 గుంటల పొలంను కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులందరూ ఒకే చోట సందర్శించి పరిశీలించడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. ధారావత్ తండాను టూరిజం హబ్‌గా కేసీఆర్ కుటుంబ సందర్శనకు తీర్చి దిద్దుతామని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన స్కాముల వల్ల జైలుకు వెళ్లే ముందు ప్రజలను ముందస్తుగానే కలిసేందుకు పరామర్శ పేరుతో వస్తున్నారని ఆరోపించారు. పదేళ్లపాటు నష్టపోయిన రైతులకు ఏ ఒక్కరికి నష్టపరిహారం ఇవ్వలేదని, పరిహారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి లక్ష మెజారిటీ వచ్చే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ని జీరో చేయడమే లక్ష్యమన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఆ పార్టీకి లీడర్లు తప్ప కార్యకర్తలు మిగలరాదని, ఆ దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాలకుర్తి తొర్రూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, జాటోతు హమ్యా నాయక్, కాంగ్రెస్ పాలకుర్తి మండల ఇన్చార్జి హనుమాండ్ల తిరుపతిరెడ్డి, దేవరుప్పుల, పెదవంగర, కొడకండ్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు నల్ల శ్రీరాములు, ముద్దసాని సురేష్, ధరావత్ సురేష్ నాయక్, సీనియర్ నాయకులు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, జాటోత్ నెహ్రూ నాయక్, మాజీ ఎంపీపీలు గడ్డం యాకసోమయ్య, కారుబోతుల శ్రీనివాస్ గౌడ్, పాలకుర్తి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు,సేవాదళ్ రాష్ట్ర నాయకులు గుగ్గిళ్ళ ఆదినారాయణ, మాజీ సర్పంచుల పోగు శ్రీనివాస్, మాచర్ల పుల్లయ్య, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు లావుడియా భాస్కర్ నాయక్, పాలకుర్తి పట్టణాధ్యక్షుడు కమ్మగాని నాగన్న గౌడ్, నాయకులు పెనుగొండ రమేష్, కమ్మగాని రమేష్, మెరుగు మల్లేష్ గౌడ్, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి రాజేష్ యాదవ్, గుగులోతు కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ సీఎం కేసీఆర్ పర్యటనలో బీఆర్ఎస్ నేతలు...

నవతెలంగాణ-దేవరుప్పుల

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో రైతుల పంటలు ఎండిపోయాయని ఆదివారం మండలంలోని ధరవత్ తండా వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పంటలు ఎండిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, పెద్ది సుదర్శన్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు గాంధీ నాయక్, గుడి వంశీధర్ రెడ్డి, పల్లా సుందర్ రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు బస్వ మల్లేష్, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, కోతి ప్రవీణ్, కొల్లూరి సోమన్న తదితరులు పాల్గొన్నారు.



ఘన స్వాగతం పలికిన నాయకులు...

నవతెలంగాణ-లింగాలఘనపురం

మాజీ సీఎం కేసీఆర్ ఎండిపోయిన పంటల పరిశీలనలో భాగంగా ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలానికి వెళ్తున్న క్రమంలో లింగాలగణపురం మండలం నెల్లుట్ల గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షురాలు చిట్ల జయ శ్రీ ఉపేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండల నాయకులు సుధీర్ రెడ్డి, రాజు, శ్రీహరి, మనోహర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, లింగమూర్తి, యాదగిరి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కూతురుతో కలిసి కాంగ్రెస్‌లోకి 'కడియం'

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏఐసీసీ పరిశీలకురాలు దీపాదాస్ మున్షీ సమక్షంలో కడియం కూతురు కావ్యతో కలిసి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. వీరి వెంట వేం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మల్లారెడ్డి

నవతెలంగాణ-లింగాలఘనపురం



సీఎం రేవంత్ రెడ్డిని తన నివాసంలో జనగామ జిల్లా కాంగ్రెస్ నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచాలు అందించి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.



ఇందిరకు సముచిత స్థానం కల్పించాలి

- లింగాల జగదీష్ చందర్ రెడ్డి

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

రెండు సార్లు ఎమ్మెల్యే పోటీ చేసి ఓడినా నియోజక వర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న టీపీసీసీ రాష్ట్రప్రధాన కార్య దర్శి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ సింగపురం ఇందిరకు పార్టీలో సముచిత స్థానం కల్పించాలని జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి అన్నారు. ఆదివారం నియోజక వర్గ కేంద్రంలో మండలాధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అధిష్టానం, సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారెం టీలు అమలు చేయడంతో ప్రజలంతా కాంగ్రెస్‌ని ఆదరిస్తున్నారని అన్నారు.ఇప్పటికైనా అధిష్టానం పునరాలోచించి,రెండు సార్లు ఎమ్మెల్యేగా స్వల్ప ఓట్లతో ఓడిపోయినప్పటికి కార్యకర్తల కష్టసుఖాలు తెలుసుకొని, సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తున్న సింగపురం ఇందిరకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీసీసీ డైరెక్టర్ చింత ఎల్లయ్య, బ్లాక్ అధ్యక్షులు లింగాల సుభాష్‌రెడ్డి, గాదె రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, మంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుండి పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-కొడకండ్ల

బైక్ పై నుండి పడి సున్నపోతు వెంకన్న మృతి చెందిన సంఘటన మధ్యాహ్నం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రం నుండి గుమ్మలకొండ తండాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో అఖ్యాతండ దుర్గమ్మ గుడి వద్ద అదుపుతప్పి రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందినట్లు వాహనదారులు తెలిపారు. స్థానిక ఎస్సై శ్రావణ్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

ఈస్టర్ పండుగను పురస్కరించుకుని డివిజన్ కేంద్రంలో పలు చర్చీలలో తెల్లవారుజామున నుండే ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుడ్ ఫ్రైడే రోజున సిలువపై అవుసులు బాసిన యేసు మూడోరోజు సమాధి నుండి భక్తులకు దర్శనమిస్తారు. క్రీస్తు పునరుత్థానం చేసిన మహోన్నత రోజు ఈస్టర్ అని, క్రైస్తవులు పునరుత్థాన శక్తితో ఆధ్యాత్మికంగా పునీతులు కావాలని క్రైస్తవ మత పెద్దలు తెలిపారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలో ఏసు ప్రభు కోసం ప్రత్యేక పాటలు ఆలపించారు. పట్టణ, మండలంలో పలు చర్చీలు సందడిగా కనిపించాయి.

స్వార్థం కోసం పార్టీ మారుతున్న నాయకులు

నవతెలంగాణ-లింగాలఘనపురం



స్వార్థపరులు రాజకీయ లబ్ది కోసం పార్టీలు మారుతున్న నాయకుల పట్ల కాంగ్రెస్ అధిష్ఠానం ఆలోచన చేయాలని నాయకులు అంటున్నారు. ఆదివారం మండలం నేలపోగుల గ్రామ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షుడు గైని ప్రవీణ్, సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి నేలపోగుల ఎంపీటీసీ డాక్టర్ గుగ్గిళ్ళ నర్సయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ అధికారంలో లేకపోయినా బీఆర్ఎస్ నాయకులు ఎన్ని కేసులు పెట్టిన భయపడకుండా వారు చేసే అరాచకాలకు బెదరకుండా కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ కాంగ్రెస్‌లోకి వస్తామని నేలపోగుల మాజీ సర్పంచ్ దూసరి గణపతి వారి అనుచరులు అంటున్నారు. ఇతను కాంగ్రెస్ మీద ప్రేమతో లేక గ్రామం మీద మమకారంతో కాంగ్రెస్‌లోకి రావడం లేదు. గత ఐదు సంవత్సరాల కాలంలో నేలపోగుల సర్పంచ్‌గా కొనసాగి ఇతను ఉపసర్పంచ్ సంతకం ఫోర్జర్ చేసి సుమారుగా 36 లక్షల నుంచి 50 లక్షల వరకు అక్రమంగా డబ్బులు డ్రా చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై కలెక్టర్‌కి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. దీనిమీద సీరియస్‌గా విచారణ జరుగుతోంది. దానిని కప్పిపుచ్చుకోవడానికి ఈరోజు కొత్త డ్రామా ఆడుతున్నారు. ఇతను ఎక్కడ మాట్లాడినా నేను 25 సంవత్సరాలుగా రాజకీయం చేస్తున్నానని చెప్తాడు కానీ ఈ 25 సంవత్సరాల్లో 10 సంవత్సరాలు టీడీపీలో ఉన్న నీవు తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులమైన మాపై అనేక అక్రమ కేసులు పెట్టిన తెలంగాణ ద్రోహివి నీవు అప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్నావు. కాంగ్రెస్ కార్యకర్తలపై అనేక తప్పుడు ఆరోపణలు అనేక ఇబ్బందుల గురి చేసిన నీవు ఇప్పుడు మళ్లి ఏ ముఖం పెట్టుకొని కాంగ్రెస్‌లోకి వస్తావో..? మేము చూస్తాం అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి రావద్దని గో బ్యాక్ అంటూ పెద్ద సంఖ్యలో నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో నేలపోగుల కాంగ్రెస్ నాయకులు ఓబిసి సభ్యులు జోగు రాజు, ఆకుల సత్తయ్య, గుగ్గిళ్ళ కొమురయ్య, మైల సాయిలు, మైల ఉప్పలయ్య, గోగు కొమురయ్య, సిహెచ్ సంపత్ రెడ్డి, ఆకుల సాయి, కోల నవీన్, తేరాల శ్రీకాంత్, గుగ్గిళ్ళ సతీష్, గుగ్గిళ్ళ ప్రభాకర్, సముద్రాల శ్రీధర్, గైని నవీన్, నోముల రజినికాంత్, గుగ్గిళ్ళ సామ్యేల, కాశీ యాదయ్య కాశీ నరసయ్య, నోముల ఉపేందర్, గుగ్గిళ్ళ అబ్బసాయిలు, గుగ్గిల నాగన్న, యూత్ అధ్యక్షులు మైల రాజు, ఉపాధ్యక్షులు పన్నీరు అరుణ్, గుగ్గిళ్ళ సాగర్, అనిల్, భాస్కర్, కృష్ణ, యాదయ్య శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన... | సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన

కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-జనగామ



ఎన్నికల ప్రచారణ నిర్వహణకు సంబంధించిన అనుమతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్లిన సీపీఎం నాయకులపట్ల దురుసుగా ప్రవర్తించి అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమానికి సీపీఎం పట్టణ కార్యదర్శి జోగుప్రకాష్‌అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తిరాజు పాల్గొని మాట్లాడారు. శనివారం రోజునఎన్నికల సంబంధించిన అంశాలపైన ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ పాషా దృష్టికి తీసుకెళ్లేందుకు కలెక్టర్ కార్యాలయానికి జిల్లా కార్యదర్శి కనకా రెడ్డితోపాటు సీపీఎం ప్రతినిధి బృందం వెళ్లడం జరిగిందన్నారు. కలెక్టర్‌ని కలుస్తామని సీసీకి సమాచారం చెప్పగా ఎన్నికలు అయిపోయేంతవరకు రాజకీయ పార్టీ నాయకులు కలెక్టర్‌ను కలవద్దని చెప్పారన్నారు. కాగా ఈ వైఖరి సరైనది కాదు కలెక్టర్‌కి విషయం చెప్పేది ఉంది ఒకసారి అడగమని మళ్లీ చెప్పగా ఒకరినే రమ్మంటున్నారని అతను చెప్పడం జరిగిందన్నారు. చాంబర్లోకి సీపీఎం జిల్లా కార్యదర్శి వెళ్ళగానే కలెక్టర్ ఇక్కడికి ఎందుకు వచ్చావు..?కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు చేయాలని తెలియదా..? మీ పార్టీ నుండి ఎన్నికల సమావేశాలకు వచ్చేటోడు ఎవడు, వాడికి తెలువదా..? అంటూ అమర్యాదగా దురుసుగా ప్రవర్తించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సీపీఎం జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భువనగిరి పార్లమెంటు పరిధిలోని జనగామ నియోజకవర్గ ఎన్నికల సమావేశం గూర్చి 48 గంటలకు ముందే పర్మిషన్ తీసుకోవాల్సి ఉందని, ఈ విషయంపై సువిధలో అప్లై చేసుకునేందుకు వెళ్లగా ఓపెన్ కావట్లేదు అనిఆన్లైన్ సెంటర్లో చెప్పారని తెలిపారు. ఈ విషయంపై ఆర్డీవో కార్యాలయానికి వెళ్తే అక్కడ కూడా ఓపెన్ కావట్లేదని, మేము ఏమి చేయలేమని చెప్పినట్లుగా తెలిపారు.

ఈ విషయంపై క్లారిటీ కోసం కలెక్టర్ కార్యాలయానికి వెళ్తే మేము చెప్పే విషయాలు వినకుండా ఇక్కడికి రావద్దు అనడంఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ విషయంపై సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల అధికారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సీపీఎం నేతలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సుంచు విజేందర్, ఎండి అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు మంగ బీరయ్య, కళ్యాణం లింగం,పందిళ్ళ కళ్యాణి, బోట్ల శ్రావణ్, నాయకులు కొండ వరలక్ష్మి, లింగాల సుగుణ, కచ్చ గళ్ళ వెంకటేష్, భూనాద్రి వెంకటేష్, సుధాకర్, పసిలాది నరేష్, గిద్దల ఎల్లయ్య, కర్రే బీరయ్య పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటాలి : మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ అన్నారు. వరంగల్ పార్లమెంట్ నియోజ కవర్గ పరిధి స్థాయి ఆదివారం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ గడప గడపకు తిరిగి ప్రతీ కార్యకర్త కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రతీ బూత్‌లోధిక ఓట్లు పడే విధంగా శ్రమించి లోక్ సభ ఎన్నికలు బీజేపీ సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుండె విజయ రామారావు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, డాక్టర్ రాజేశ్వర్ రావు, సీనియర్ నాయకులు రాజయ్య యాదవ్, ధర్మా రెడ్డి, పార్లమెంట్ ప్రభారి మురళీధర్,బొజ్జపల్లి సుభాష్, కో కన్వీనర్ ఐలొని అంజిరెడ్డి, యుగెందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు సట్ల వెంకట రమణ, పూంద్రు నవీన్ రెడ్డి, రడపాక ప్రదీప్, శరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత గొడవలను పార్టీపై రుద్దడం సిగ్గు చేటు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్

నవతెలంగాణ-ములుగు



నిన్న సాయంత్రం ములుగు మండలం ఇంచేర్ల గ్రామంలో జరిగిన ఘటనపై పూర్తి స్థాయిలో పోలీస్‌లు విచారణ చేపట్టాలని కాంగ్రెస్ కార్యకర్త శనబోయిన అశోక్‌పై ఇదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మామిడి అశోక్ కొంత మంది గుండాలతో ఇంటిపై దాడి చేసి అతనిని తీవ్రంగా కొట్టడంతో పాటు అతని బైక్, కారును ధ్వంసం చెయ్యడంతో ఆత్మ రక్షణ కోసం కత్తి పడితే మమ్ముల చంపడం కోసం అని బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేయడం సిగ్గు చేటని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పటేల్ తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా శానబోయిన అశోక్, మామిడి అశోక్‌లకు వ్యక్తిగత గొడవలు ఉన్నాయని పలుమారు ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు కూడా చేసుకోవడం జరిగిందని, వ్యక్తిగతంగా జరిగిన గొడవను అధికార పార్టీపై రుద్దడం హాస్యాస్పదమని, 10 యేండ్లు పాలించిన బీఆర్ఎస్‌ని మొన్న జరిగిన ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించిన వాళ్ళ బుద్ధి మారటం లేదని, మీలాగా మేము అక్రమ కేసులు పెట్టడం ఇండ్లపై దాడి చెయ్యడం మా నైజం కాదని తప్పు చెయ్యం తప్పు చేసిన వారిని ఎంతటి వారైనాన ఓదలి పెట్టం అని పోలీసులు నిన్న జరిగిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని మా కార్యకర్తపైన జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ గుండాలపై తగు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

జిల్లాలో బలహీనపడుతున్న బీఆర్ఎస్

- ఒక్కొక్కరుగా పార్టీకి దూరమవుతున్న నేతలు
- అధికారం మారడంతో బీఆర్ఎస్ నేతల్లో స్తబ్దత
- జిల్లాలో ప్రజాప్రతినిధులు ఉన్నా... కనిపించని బీఆర్ఎస్...
- నాయకత్వం కోసం కార్యకర్తల ఎదురుచూపులు

నవతెలంగాణ-ములుగు

గతమెంతో వైభవంగా సాగిన బీఆర్ఎస్ ప్రస్థానం జిల్లాలో నేడు పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ పార్టీ నేతల్లో కొన్ని రోజుల పాటు స్తభ్యత వాతావరణం నెలకొంది. అయితే ఒక్కొక్కరుగా బీఆర్ఎస్ అగ్ర నేతలంతా కాంగ్రెస్ వైపు దృష్టిసారిస్తున్నారని ప్రచారం సాగడం, అందుకు తగ్గట్లుగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేశవరావు, కడియం శ్రీహరి వంటి నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో ఆ ప్రభావం రాష్ట్రవ్యాప్తంగా పడింది. ములుగు జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఉన్నప్పటికీ పార్టీ ఊసే ఎక్కడ కనిపించడం లేదు. ఇప్పటికే పలు మండలాల్లో మండల పార్టీ అధ్యక్షులు పార్టీకి తమ రాజీనామాలు పంపించి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో పార్టీ అధిష్టానం దృష్టి సారించకపోతే జిల్లాలో పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా మారేప్రమాదం ఉందని కార్యకర్తలు వాపోతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు తమను పట్టించుకోలేదని,నేడు పార్టీలో కొనసాగుతున్న మద్దతు ఇచ్చే నేతే లేదని కార్యకర్తలు వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, గ్రామ కమిటీలను మార్పు చేస్తేనే పార్టీ మనుగడ కొనసాగే అవకాశం ఉందని కార్యకర్తలు వాపోతున్నారు. కాగా బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షులు కార్యకర్తలకు ఏం మేరకు మనోధైర్యం నింపుతారో.. పార్టీని ఏ మేరకు ముందుకు నడిపిస్తారో వేచి చూడాల్సిందే..?!

సంఘం బలోపేతానికి కృషి చేస్తా

- నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతనిప్పుల బిక్షపతి, సుంకరి రవీందర్

నవతెలంగాణ-ములుగు

శ్రీ బాలాజీ మున్నూరు కాపు సహకార పరపతి సంఘం బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చింతనిప్పుల బిక్షపతి, సుంకరి రవీందర్ తెలిపారు. ములుగు మండల కేంద్రంలో శ్రీ మున్నూరు కాపు పరపతి సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం తాత్కాలికా అధ్యక్షులు సత్తు రామనాథం అధ్యక్షతన ఆదివారం గట్టమ్మ సమీపంలోని బండారి హరినాథం మామిడి తోటలో జరిగింది. ఈ సమావేశంలో నూతన అధ్యక్షులుగా చింతనిపుల బిక్షపతి, ఉపాధ్యక్షులుగా జయకర్, ప్రధాన కార్యదర్శిగా సుంకరి రవీందర్, కోశాధికారిగా తోట తిరుపతి, సంయుక్త కార్యదర్శిగా గందె శ్రీను, డైరెక్టర్స్‌గా అనుముల సురేష్, శీలం వేణు, ఆకుల రాజు, గందె మధు, ఎడ్ల రాజ్ కుమార్, గంధం విజేందర్‌లు నియమితులయ్యారు. ఆడిట్ సభ్యులుగా ఎడ్ల సంపత్ ఎన్నుకొన్నారు.

ఈ సందర్భంగా సంఘం సభ్యులు సిరికొండ బలరాం, బీజేపీ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా శ్రీ బాలాజీ మున్నూరు కాపు సహకార పరపతి సంఘం సభ్యులు సిరికొండ బలరాం ఎన్నిక కావడం పట్ల కాపు సంఘం హర్షం వ్యక్తం చేసి శాలువతో సన్మానించారు. ఈ సమావేశంలో 96 మంది సంఘ సభ్యులు పాల్గొని సంఘ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. నూతన కమిటీ ఎన్నికలకు సహకరించిన సభ్యులందరికీ అధ్యక్షులు చింతనిప్పుల బిక్షపతి సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.



మిషన్ భగీరథ గేటువాల్‌కు మరమ్మతులు

- 'నవతెలంగాణ' వార్తకు స్పందించిన అధికారులు

నవతెలంగాణ-మరిపెడ

మరిపెడ మండలం ఎడ్జర్ల, గుర్రపు తండా గ్రామ పంచాయతీ పరిధిలో మిషన్ భగీరథ గేటు వాల్‌ను లీక్ చేసి సీసీ రోడ్ల క్యూరింగ్ వాడుకుంటున్న బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత గేటు వాళ్లను మరమ్మతులు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులు ఆదేశించారు. శనివారం **'నవతెలంగాణ'**లో వచ్చిన వార్త కథనంపై అధికారులు స్పందిస్తూ ఈ మేరకు మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ సిబ్బంది గేట్ వాళ్ల రిపేరు చేసి నీళ్లు పోకుండా కట్టడి చేశారు. కాగా ఈ వార్త కథనం అందించిన **'నవతెలంగాణ'**ను పలువురు అభినందించారు.



చిన్నగూడూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా జి.శ్రీనివాస్

నవతెలంగాణ-మరిపెడ

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ పరిధిలోని చిన్నగూడూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా గాడిపెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో పాత్రికేయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు గంధసిరి శ్రీపాల్, గండి ప్రవీణ్, గాడిపెల్లి సతీష్, గుర్రం నరేష్, గంగాధరి అనిల్, బోయిని నరేందర్, దుంపల శ్రీను, శ్రీరామ్ సాంబయ్య, గునిగంటి మహేష్, అంగోతు చందులాల్, గుగులోత్ శ్రీను, కాశయ్య పాల్గొన్నారు.





ఘనంగా ఈస్టర్ వేడుకలు

నవతెలంగాణ-తొర్రూరు

పట్టణంలోని పలు చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలలో మత పెద్దలు ప్రత్యేక ఈస్టర్ ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు.స్థానిక నాయకులతో కలిసి రెవరెండ్ ఫాదర్ నిరీక్షణ రావు కేక్ కట్ చేశారు. అనంతరం క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందించారు. శుభ శుక్రవారం రోజున శిలువ శ్రమను, శిలువ మరణమును అనుభవించి, మూడవ దినము ఆదివారంన పునరుత్థానము అయ్యారని చెప్పారు. క్రీస్తు ప్రభువు పట్ల విశ్వాసము కలిగిన వారికి ఆయన అనుగ్రహం ఎల్ల వేళలా ఉంటుందన్నారు. ప్రభువు చూపిన మార్గములో శాంతి, సహనం, పరస్పర సహకార గుణాలతో అన్ని వర్గాలు జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ సభ్యుడు నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు హనుమాండ్ల తిరుపతి రెడ్డి, పట్టణాధ్యక్షుడు సోమ రాజశేఖర్, మాజీ సర్పంచ్లు చాపల బాపు రెడ్డి, పెదగాని సోమయ్య, నాయకులు మెరుగు మల్లేశం గౌడ్, బచ్చలి లక్ష్మణ్, బిజ్జాల వరప్రసాద్, ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ కన్వీనర్ రాజేష్ యాదవ్, యూత్ పట్టణాధ్యక్షుడు మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



యువత ఆర్థిక స్థిరత్వం సాధించాలి

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నూకల నరేష్ రెడ్డి

నవతెలంగాణ-మరిపెడ

నేటి యువత స్వయం ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నూకల నరేష్ రెడ్డి అన్నారు. మరిపెడ పట్టణంలో షేక్ ఇమ్రాన్,షేక్ సలీంలు నూతనంగా ఏర్పాటు చేసుకున్న కార్ జోన్ (ఆల్ వెహికల్ అలైన్మెంట్, వాటర్ వాష్, కార్ డెకార్స్)ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉపాధి మార్గాలపై దృష్టి సారించాలన్నారు. నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని కుటుంబాలకు ఆసరాగా నిలవాలని సూచించారు. చిన్న తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని పలువురికి ఉపాధి కల్పించడంతో పాటు సమాజంలో ఆదర్శంగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంధసిరి అంబరీష, పానుగోతు రాంలాల్, మెంచు అశోక్ గౌడ్, అలువాల ఉపేందర్ ప్రజాపతి, గుండగాని సుందర్, ముదిరెడ్డి నరేష్ రెడ్డి, దూగుంట్ల వెంకన్న, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం కేసు నమోదు

నవతెలంగాణ-గార్ల

అక్రమంగా ఇంట్లో అమ్మకానికి ఉంచిన నాటుసారాను పట్టుకొని మహిళపై కేసు నమోదు చేసిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై జీనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శేరిపురం గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇదే గ్రామానికి చెందిన గుగులోత్ హామలీ అనే మహిళ ఇంట్లో నిల్వ ఉంచిన 7 లీటర్ల నాటు సారా ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సునారికాని నాగరాజు ఇంటిలో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు తెలుసుకున్న పోలీసులు స్థావరానికి చేరుకున్నారు. కొంత మంది పెద్ద మొత్తంలో నగదును ఏర్పాటు చేసుకొని ఆటను ప్రారంభించగా పోలీసులు వస్తున్న విషయాన్ని తెలుసుకొని పరారయ్యారు. అందులో ఇద్దరు చిక్కగా మిగతా వారు వారి వాహనాలు విడిచిపెట్టి పారిపోయారు. పోలీసులు వాహనాలను అదుపులోకి తీసుకొని దొరికిన ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిసింది.

కూరగాయల వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తా

- మార్కెట్ సందర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

నవతెలంగాణ-తొర్రూరు

పట్టణంలోని కూరగాయల వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ఆదివారం సందర్శించారు. కూరగాయల విక్రయ దారులతో కలివిడిగా మాట్లాడి ఎంతో ఆప్యాయతతో వారిని దగ్గరికి తీసుకుని తానే స్వయంగా కూరగాయలు కొని వారికి సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొర్రూర్‌లో ఇంత పెద్ద మార్కెట్ ఉన్నప్పటికిని అనుకున్న రీతిలో వ్యాపారం కొనసాగడం లేదని విక్రయదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తప్పకుండా మీ సమస్యల సాధన కోసం కృషి చేస్తానని, కూరగాయల వ్యాపారమే జీవనాధారంగా బ్రతుకుతున్న ప్రతి ఒక్కరి కోసం ప్రణాళిక బద్దంగా ఆలోచించి త్వరలోనే ప్రతి ఒక్కరు సంతోషంగా జీవించేలా నిర్ణయాలు తీసుకుంటానని చెప్పారు. పెద్ద మొత్తంలో మార్కెట్‌కోసం బడ్జెట్ కేటాయించినప్పటికీ గతంలో దానిని వినియోగించుకోవడంలో వైఫల్యం జరిగిందని భవిష్యత్తులో ఈ మార్కెట్‌ను ఇంకా అభివృద్ధి చేయడంతో పాటు మార్కెట్‌పై ఆధారపడి జీవిస్తున్న ప్రతి విక్రయదారుడు గర్వంగా జీవించేలా కృషి చేస్తానని అన్నారు. త్వరలోనే నాన్ వెజ్ మార్కెట్ కోసం నిర్మించిన భవనంలోనే మార్కెట్ నియమ నిబంధనలను అనుసరించి అక్కడే మాంసకృతులు విక్రయించేలా చర్యలు చేపట్టి అన్ని రకాల అభివృద్ధికి సహకరిస్తానని అన్నారు.

మార్కెట్‌కు సంబంధించి టాయిలెట్స్, మంచినీళ్ల వసతి, లైటింగ్ తదితర అంశాలపై విక్రయదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందించి తప్పక అన్ని సమస్యలపై దృష్టి సారించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు సోమ రాజశేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు తునం రోజా ప్రభుదాస్, బుసాని రాము, శంకర్, అనిల్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



మండల ప్రజల మదిలో...

నేడు సీపీఎం అధ్వర్యంలో 23వ వర్ధంతి వేడుకలు

'సార్'గా నిలిచిన 'మంగపతిరావు'

నవతెలంగాణ-గార్ల

మండల సీపీఎం పార్టీ నిర్మాతలలో ప్రముఖులు, ఆదర్శ కమ్యూనిస్టు నేత ఐతపు మంగపతిరావు 23వ వర్ధంతి వేడుకలను నేడు సీపీఎం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. మంగపతిరావు నేపథ్యం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో బ్రహ్మణ సామాజిక వర్గంలో పుట్టిన ఐతపు మంగపతిరావు గార్ల మండలానికి వచ్చి మండలంలో ప్రజలకు అండగా నిలిచి సీపీఎం పార్టీ నిర్మాణానికి అంకిత భావంతో పని చేశారు. పేదలకు ఉచిత విద్యను అందించడానికి మండల కేంద్రంలో ఒక ప్రయివేటు వసతి గృహాన్ని స్వచ్ఛందంగా ఏర్పాటు చేసి వందలాది మందిని విద్యావంతులుగా తీర్చిదిద్దిన మహనీయులు మంగపతిరావు. విద్యావంతులైన మంగపతిరావు అంగ్ల భాషను అనర్గళంగా మాట్లాడేవారు. ఖాజీపేట నుండి విజయవాడ వరకు రైల్వే ఉద్యోగులకు, కార్మికులకు సుపరిచితుడుగా నిలిచిన మంగపతిరావు రైల్వే ఉద్యోగుల హక్కుల కోసం పోరాటాలు చేసేవారు. ఆనాడు మంగపతిరావు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వసతి గృహంలో విద్యనభ్యసించిన పలువురు నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారంటే మంగపతిరావు చలువే అని చెప్పవచ్చు. మండలంలో సీపీఎం పార్టీని స్థాపించడంలో మంగపతిరావు కీలకపాత్ర పోషిస్తూ ఎడ్లబండ్ల సంఘాన్ని స్థాపించి మండలంలో మొట్ట మొదటి సారిగా హమాలీ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి హమాలీలకు ఉపాధి కల్పించారు. ఉన్నత సామాజిక వర్గంలో పుట్టిన మంగపతిరావు అట్టడుగు, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేయడమే కాకుండా మండలంతో పాటు సమీప మండలాలకు చెందిన ప్రజల మదిలో గౌరవంగా 'సార్' గా చెరగని ముద్ర వేసుకున్న ఆదర్శ మార్క్సిస్ట్ నాయకుడు మంగపతిరావు. గత రెండు దశాబ్దాల క్రితం మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయాన్ని మంగపతిరావు భవనం పేరుతో నిర్మించి కమ్యూనిస్టు నాయకులు,కార్యకర్తలు మంగపతిరావు పట్ల గౌరవాన్ని నిలుపుకోగా ఎన్నో పోరాటాలకు, ఆందోళనలకు, ఉద్యమాల రూపకల్పనకు మంగపతిరావు భవనం వేదికగా నిలుస్తుందని చెప్పవచ్చు. కమ్యూనిస్టు పార్టీమార్క్సిస్ట్ పార్టీకి నిస్వార్ధ సేవతో పని చేసిన మంగపతిరావు 23వ వర్ధంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో నేడు ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న సభకు సీపీఎం జిల్లా, మండల, శాఖ నాయకులు, ప్రజా సంఘాల జిల్లా, మండల బాధ్యులు, వామపక్ష, ప్రజాతంత్ర వాదులు హజరై వర్ధంతి ఘనంగా నివాళులు అర్పించాల్సిన బాధ్యత మనందరి పై ఉంది.





పదవీ విరమణ పొందిన హెచ్ఎం వెంకటేశ్వరరావుకు ఘనంగా సన్మానం

నవతెలంగాణ-తాడ్వాయి

పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు వి.వెంకటేశ్వరరావును ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు రాజేష్, కాటాపూర్ పిఎస్ హెచ్ఎం పాయం మానేశ్వర్ రావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాటాపూర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఆయనకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పదవీ విరమణ చేసిన వెంకటేశ్వరరావు దంపతులకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కాటాపూర్ జెడ్పిహెచ్ఎస్ ఇన్చార్జి హెచ్ఎం రాజేష్, పిఎస్ హెచ్ఎం మానేశ్వర్ రావు, పలువురు వక్తలు మాట్లాడుతూ వెంక టేశ్వరరావు టీచర్‌గా ఉద్యోగంలో ప్రవేశించినప్పటి నుండి ఎన్నో ఒడిదు డుకులను ఎదుర్కొన్నారని, అంచెలంచలుగా ఉన్నత స్థాయికి ఎదిగారని కొనియాడారు. మొదట సెకండ్ గ్రేడ్ టీచర్‌గా తర్వాత గెజిటెడ్ ప్రధానో పాధ్యాయులుగా ఎన్నో సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎన్నో సేవలు అందించారని అన్నారు. ఆయన తన పదవీకాలంలో ఎన్నో పురస్కారాలను అందుకున్నారన్నారు.

ఆశల పూత... నిలబడేనా కాత..?

- రెండేళ్లుగా రైతులు నష్టపోతున్నారు
- జాగ్రత్తలు పాటిస్తే మేలు
- ఉద్యానవన అధికారి రాకేష్

నవతెలంగాణ-తొర్రూరు

మామిడి రైతులకు రెండేళ్ల నుంచి కష్టాలు తప్పడం లేదు. గతేడాది వర్షాల కారణంగా ఆలస్యంగా పూత పూసినా... తెగుళ్ల ప్రభావం వలన పిందెలు రాలి కాత నిలబడలేదు. అంతంత మాత్రంగా ఉన్న కాత కూడా అకాల వర్షాలకు నేల రాలిపోయింది. దిగుబడి గణనీయంగా తగ్గి మామిడి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఈ ఏడాది కూడా వాతావరణ పరిస్థితుల కారణంగా ఆలస్యంగా పూత పూసింది. ఈ క్రమంలో మామిడి చేతికి వచ్చే సమయానికి పూత, పిందే రాలిపోయే ప్రమాదం ఉంది. పలు రకాల తెగుళ్ల ఆశించి నష్టాన్ని చేకూరుస్తాయి. ఎప్పటికప్పుడు సస్య రక్షణ చర్యలు చేపడితే మేలని తొర్రూరు ఉద్యానవన శాఖ అధికారి రాకేష్ రైతులకు సూచిస్తున్నారు.

జిల్లాలో 14వేల 929 ఎకరాల మామిడి తోట ఉండగా తొర్రూరు డివిజన్లో 8798 ఎకరాల్లో మామిడి రైతులు తోటలు వేశారు. తొర్రూరులో 1601 ఎకరాల్లో, పెద్దవంగరలో 1211, నెల్లికుదురులో 715, దంతాలపల్లిలో 1755, నరసింహులపేటలో 946, మరిపెడలో 2364, చిన్నగూడూరులో 206 ఎకరాల్లో రైతులు మామిడి తోటలు వేశారు. జిల్లాలో మామిడి తోటకు భూములు అనుకూలంగా ఉండడంతో వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. బంగినపల్లి, పెద్ద రసాలు, చిన్న రసాలు, కేసరి, హిమాయత్, మహమూద, తెల్ల గులాబీ, గోవా, నీలాలు, తోతాపరి, దేశి తదితర రకాల మామిడి తోటలో రైతులు పెంచుతు న్నారు.

యాజమాన్య పద్ధతులు...

ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెల వరకు మామిడిలో యాజమాన్య చర్యలు తీసుకుంటే అధికదిగుబడులు వస్తాయి. మూడు నెలల పాటు యూరియా, పోటేష్, బోరాన్ ఎరువులు వినియోగించాలి. మందులు ఒకేసారి కాకుండా పలు దాఫాలుగా వేయాలి. పదేళ్ల పైబడిన చెట్టుకు 700 గ్రాములు డిఏపి, 400 గ్రాముల యూరియా, 800 గ్రాముల ఎంఓపి మందును వేసి క్రమం తప్పకుండా నీటి తడులు పెట్టాలి.



బూడిద తెగులు...

మామిడికి పూత దశలో బూడిద తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. వేర్లు ఆయా భాగాల నుంచి పోషకాలు నీటిని పీల్చడం వలన పూత పిందెలు నల్లగా మారి రాలిపోతాయి. కాగితంపై దులిపితే పేను వంటి నల్లటి తామర పురుగులు కనిపిస్తాయి. నివారణకు 150 గ్రాముల తయోమితా మిక్సీమ్ లీటరు మందు 500 లీటర్ నీటితో కలిపి పిచికారి చేయాలి. తెగులు తీవ్రత ఉధృతంగా ఉంటే 40 శాతం ఫిప్రోనిల్, 40 శాతం ఇమిరా క్లోప్రైడ్, 150 గ్రాములు ట్రిబుకోనజోల్ 250 గ్రా, 500 లీటర్ల నీటిలో కలిపి చల్లితే మంచి ఫలితం ఉంటుంది.

తామర పురుగు...

తామర, తేనె మంచు పురుగులు చేరి ఆకులు, పిందెల నుంచి రసాన్ని పీల్చి రాలిపోయేలా చేస్తాయి. ఉధృతి ఎక్కువగా ఉంటే ఫిప్రోనిల్ రెండు మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. పూత, పిందే సమయంలో వర్షాలు కురిస్తే తెగుళ్ల బెడద అధికంగా ఉంటుంది.



పిందె రాలకుండా చర్యలు...

పూత పిందెగా మారి బటాని గింజ సైజులో ఉన్నప్పుడు పసుపు రంగులోకి మారి రాలిపోతుంటే నివారణకు 2.5 కిలోల ఫార్ములా 4 లేదా 2.5 కిలోల ఫార్ములా 8, ప్లానో ఫిక్స్ 100 మిల్లీలీటర్లను ఐదువందల లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి. పండు ఈగ వల్ల కూడా పిందె రాలుతుంది. నివారణకు లింగ ఆకర్షణ బుట్టలను ఎకరానికి 10 నుంచి 30 వరకు ఏర్పాటు చేయాలి.

వేడుకలే... ప్రచార వేదికలు


- శుభ, అశుభ కార్యక్రమాల్లో అభ్యర్థుల సందడి
- పత్యక్ష ప్రచారానికి దూరంగా అభ్యర్థులు
- తొందర ఎందుకు ఖర్చు దండగ
- ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు
- ఆ ముగ్గురు సన్నిహితులే కావడం విశేషం

నవతెలంగాణ-మహబూబాబాద్

వైవిధ్య భరిత రాజకీయాలకు గిరిజనులకు పెట్టని కోట ఆయన మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో అభ్యర్థుల ప్రచారం ఆసక్తిగా సాగుతుంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల పేర్లు ఖరారు అయినప్పటికీ ప్రచారం ప్రారంభం కాలేదని చెప్పక తప్పదు. నేటికీ ఆ మూడు పార్టీల అభ్యర్థులు ప్రధానంగా జన సమూహం అధికంగా ఉండే పెళ్లిళ్ల గుళ్ళు, గోపురాలు, జాతరలో సందడి చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటికీ వెయిట్ అండ్ సి అనే ధోరణిలో ఉన్నారు. అక్కడక్కడ పార్టీకి సంబంధించిన సమావేశాన్ని నిర్వహించినప్పటికీ అవి అంతర్గతంగానే ఉంటున్నాయి. బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్‌షోలు, పోస్టర్లు, ప్రచారరథాలు ఇంకా ప్రారంభం కాలేదు.

ఇప్పటి నుంచి ప్రచారం ఎందుకు ఖర్చు దండగ అనే యోచనలో అభ్యర్థులు ఉన్నట్లుగా కనిపిస్తుంది. అంతేగాక తెలంగాణ వ్యాప్తంగా రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే విషయం అర్థం కాక కార్యకర్తలు, నాయకులు ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసిన తర్వాతనే ప్రచారానికి దిగాలని భావిస్తున్నారు. ఎవరికివారు బయట గెలుపు దీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ అంతర్గతంగా ఓటమి భయం వెంటాడుతోంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ముగ్గురు సహితులే కావడం గమనార్హం. ఈ ముగ్గురు నియోజకవర్గంలో మూడుసార్లు ఒక్కొక్కసారి గెలిచినవారు కావడం మరొక విశేషం. సిట్టింగ్ ఎంపీగా ఉన్న మాలోతు కవిత బీఆర్ఎస్ నుంచి, మాజీ కేంద్ర సహాయ మంత్రి పోరిక బలరాం నాయక్ కాంగ్రెస్ నుంచి, మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్ బిజెపి నుంచి బరిలో ఉన్నారు.

ఇందులో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ నుంచి 50 మందికి పైగా పార్లమెంట్ టికెట్ కోసం దరఖాస్తు చేయగా పార్టీ మాత్రం బలరాం నాయక్ వైపే మొగ్గుచూపి అభ్యర్థిగా ప్రకటించారు. అలాగే ఎంపీ మాలోతు కవిత గతంలో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ క్రమంలో కవిత పోటీపై అనేక ఊహగానాలు ప్రచారంలో ఉన్నాయి. ఇకపోతే మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ బిజెపిలో ఇలా చేరగానే అలా టికెట్ సాధించి బరిలో నిలిచారు. 2014లో ఎంపీగా గెలిచినప్పటికీ 2019లో టికెట్ రాకపోవడంతో గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు దూరమయ్యారు. రాజకీయాల్లో లేరని చెప్పక తప్పదు. ఈ క్రమంలో ఈ ముగ్గురు నువ్వా... నేనా... అంటూ పరస్పర ఆరోపణలు విమర్శలతో సై... అంటే సై... అనే పరిస్థితిలో పోటీలో లేరని చెప్పక తప్పదు. ఎవరి ప్రచారం వారు చేసుకుంటున్నారు. ప్రధానంగా అభ్యర్థులు ముగ్గురు పెళ్లి వేడుకల్లో సందడి చేస్తున్నారు. పేదోడు గొప్పోడు అనే తేడా లేకుండా రాజకీయ పార్టీలకతీతంగా ప్రతీ పెళ్లి వేడుకల్లో కనిపిస్తున్నారు. ఆ శుభ కార్యక్రమాల్లో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి మేమున్నామంటూ అండదండగా ఉంటూ భరోసా ఇస్తున్నారు. ఏ నియోజకవర్గానికి ఏ గ్రామానికి వెళ్ళినా అక్కడ ఉన్న దేవాలయాల్లో పూజలు పునస్కారాలు సన్మానాలలో మునిగి తేలుతున్నారు. అంతేగాక గ్రామాల్లో జరిగే మైసమ్మ ఉప్పలమ్మ లాంటి దావతులలో కూడా మేమున్నామంటూ హాజరు వేసుకుంటున్నారు. కొన్ని రాజకీయ పార్టీలు అభ్యర్థులను మార్చడం కొంత మంది పోటీలో నుంచి తప్పుకోవడం నేటి రాజకీయాలలో హాట్ టాపిక్‌గా మారిన నేపథ్యంలో మానుకోట పార్లమెంట్ నియోజకవర్గంలో ఏం జరుగుతుందో..? అని కార్యకర్తలు ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఏదైనాప్పటికీ రాజకీయాల్లో శాశ్వత శత్రువులు ఉండరు అనేది జగమెరిగిన సత్యం. నేటి రాజకీయాలు అత్యంత వేగంగా రాత్రికి రాత్రి కండువాలు మార్చడం జరుగుతుంది. ఈ విపత్కర పరిస్థితిలో చివరి వరకు ఏ పార్టీ నుంచి ఏ అభ్యర్థి పోటీలో ఉంటారో..? ఎవరు జారుకుంటారో..? అనే చర్చ తీవ్రంగా జరుగుతుంది. ఈ సస్పెన్స్‌కు తెరపడాలంటే నామినేషన్ల వరకు వేచి చూడక తప్పదు..?!



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
సోమవారం | ఏప్రిల్ 01, 2024 | www.navatelangana.com

సీసీ రోడ్డుకు వాటర్ క్యూరింగ్

నవతెలంగాణ వార్తకు స్పందన



నవతెలంగాణ-గణపురం

జిల్లా కలెక్టర్ భవిష్ మిశ్రా ఆదేశాలతో సీసీ రోడ్డుకు ఆదివారం ట్యాంకర్లతో నీళ్లు పోశారు. నగరంపల్లి గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించారు. క్యూరింగ్ మరిచారు'. అనే వార్త ప్రచురణ కాగా జిల్లా కలెక్టర్ స్పందించారు. సంబంధిత అధి కారులకు పేపర్ కటింగ్ పెట్టి దీని వివరణ కావాలని ఆదేశాలు జారీ చేయడంతో వెంటనే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేయడంతో వాటర్ ట్యాంకర్ల ద్వారా క్యూరింగ్ చేసినట్లు నగరంపల్లి గ్రామ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో భాస్కర్ తెలిపారు.

అంబట్‌పల్లిలో కార్డెన్ సెర్చ్



నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మహాదేవపూర్ మండలం అంబట్ పల్లి గ్రామంలో పోలీసులు ఆదివారం కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వ హించారు. గ్రామంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి 25 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. వాహనాల పత్రాలు తనఖీ 16 వాహనాలకు ఫైన్‌లు, 6 నంబర్ ప్లేట్ లేనివారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రానున్న ఎంపీ ఎన్నికలసందర్భంగా ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున సోషల్ మీడియాలో ఎవరూ వివాదాస్పద పోస్టులు పెట్టకూడదని సూచించారు. కార్యక్రమంలో మహదేవ్ పూర్ సిఐ, రాజేశ్వర్ రావు, ఎస్ఐ కె ప్రసాద్ సిఆర్పిఎఫ్ సిఐ భాస్కరన్, సిబ్బంది పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశానికి వెళ్లిన ఉద్యమకారులు

నవతెలంగాణ-మల్హర్‌రావు

టీయూఎఫ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న తెలంగాణ పునర్నిర్మాణంపై నిర్వహిస్తున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి భూపాలపల్లి జిల్లా నుంచి టీయూఎఫ్ ఫోరం జయశంకర్ జిల్లా అధ్యక్షులు యాదండ్ల గట్టయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బోయిని రాజన్నయాదవ్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం, జయశంకర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గడ్డం సమ్మక్క, మండల అధ్యక్షులు ముడితనపెల్లి ప్రభాకర్, మండల మహిళ అధ్యక్షురాలు బండారి యశోద, మండల ఉపాధ్యక్షులు సభాపత్ నాగరాజు, ఉద్యమకారులు బడితెల వెంకటస్వామి పాల్గొన్నారు.



నేషనల్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-మల్హర్‌రావు

లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నియామకం పట్ల కాంగ్రెస్ నాయకులు ఇందారపు చెంద్రయ్య, దన్నపనేని సురేష్‌రావు, ఇందారపు ప్రభాకర్, బొబ్బిలి రాజుగౌడ్, మల్లేష్, రాహుల్, శేఖర్‌లు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మంత్రిని కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.



ఘనంగా రన్‌ఫర్ జీసస్ ప్రోగ్రాం

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

మండలంలోని బెగ్లూర్, రాపల్లికోట గ్రామాల్లో పాస్టర్స్ జోసెఫ్, ప్రకాష్, సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకల, రన్ ఫర్ జీసస్" ప్రోగ్రాంను ఘనంగా నిర్వహించారు. "రన్ ఫర్ జీసస్"కార్యక్రమం సందర్భంగా "జయహో, జయహో- యేసు లేచెను జయహెూ" "రన్ ఫర్ - జీసస్" నినాదాలతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కర్యక్రమాన్ని పాస్టర్ జోషప్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బెగ్లూర్, రాపల్లికొట గ్రామ సంఘ పెద్దలు, పలు గ్రామాల విశ్వాసులు, జీసస్ లవ్స్ ప్రేయర్ టీం సభ్యులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దపల్లి ఎంపీ సీటు కాంగ్రెస్‌కే కైవసం

నవతెలంగాణ-మహదేవ్‌పూర్

త్వరలో జరగనున్న పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలలో పెద్దపల్లి ఎంపీ సీటును మంత్రి శ్రీధర్‌బాబు నాయకత్వంలో కైవసం చేసుకుంటామని బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి భాస్కర వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో పెద్దపల్లి పార్లమెంట్‌లోని అన్ని నియోజక వర్గాలు మరింత అభివద్ధి చెందుతాయని తెలిపారు.

బాధిత కుటుంబానికి 'దుద్దిళ్ల' పరామర్శ

నవతెలంగాణ-మహదేవ్‌పూర్



కాటారం మండలంలోని విలసాగర్ గ్రామంలో పెద్దపల్లి సమ్మక్క ఆదివారం అనారోగ్యంతో మతి చెందారు. ఆమె వారి పార్థివ దేహానికి శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనుబాబు వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి వెంకటయ్య పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని కొంకపాకలో గద్దల ఎల్లమ్మ మరణించగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అంత్య క్రియల్లో పాల్గొని నివాళులు అర్పించారు.అనంతరం మతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వర్ధన్నపేట ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి కొండేటి మధుకర్ పాల్గొన్నారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం వద్దు

నూతన బొగ్గు గనులు వస్తేనే సింగరేణికి భవిష్యత్తు

ఏఐటీయూసీ గెలిచిన గుర్తింపు పత్రం ఇవ్వని యాజమాన్యం

సింగరేణి ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై పోరాటం..

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షులు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్



నవతెలంగాణ-భూపాలపల్లి

సింగరేణిలో మునుపెన్నడు లేని విధంగా రాజకీయ జోక్యం అవినీతి తారాస్థాయికి చేరుకుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూరు నగర్ లోని ఇల్లందు క్లబ్ హౌస్ లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ లో ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అధ్యక్ష , ప్రధాన కార్యదర్శి లు మాట్లాడుతూ సింగరేణిలో అవినీతి రహిత పాలన కోరు కొని ఏఐటీయూసీని కార్మికులు గుర్తింపు సంఘం గా గెలిపించాలని తెలిపారు.. గత పాల కుల రాజకీయ జోక్యంతో కార్మిక సంఘాలే యాజ మాన్యానికి బ్రోకర్లుగా ఏర్పాటు చేసి మెడికల్ దందా నిర్వహించారని విమర్శించారు. సింగరేణిలో నూతన గనులు వస్తేనే భవిష్యత్తు మనుగడ ఉంటుందని కొత్త బావుల ఏర్పాటు కోసం ఏఐటీయూసీ అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. అట్లాగే సింగరేణిలో సింగరేణి తాడిచెర్ల ఓ సీ2 ఇల్లందు కోయగూడెం ఓసి త్రీ, సత్తుపల్లి శ్రావణిపల్లి కేకే 6 ఇంక్లైన్ బావులను సింగరేణి ఆధ్వర్యంలో బొగ్గు తీయాలని గుర్తింపు సంఘంగా యాజమాన్యాన్ని కోరడం జరిగిందని త్వరలోనే ఈ నూతన బావులు ఏర్పాటు అవుతాయని దీంతో మరో 50ఏళ్లు సింగరేణి డోకా ఉండదని అన్నారు. సింగరేణిలో క్లరికల్ ఉద్యోగాలు ఇంటర్నల్ సింగరేణిలో పనిచేసే విద్యావంతులకే ఇవ్వాలని దానికోసం 360 పోస్టులు 15 రోజులలో నోటిఫికేషన్ రాబోతుందని తెలిపారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలిచి సుమారు మూడు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు సింగరేణి యాజమాన్యం రాజకీయాలు చేస్తూ కోడ్ ఆఫ్ కండక్ట్ పేరుతో గుర్తింపు సంఘం పత్రం కూడా ఇవ్వడం లేదని అన్నారు. దీంతో స్ట్రక్చర్ మీటింగ్ లు జరగక కార్మిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని అన్నారు. గతంలో హౌసింగ్ లోన్ పెట్టుకున్న వారికి లోన్ మంజూరు కాక ఆపేశారని వారికి కూడా ఇచ్చే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సింగరేణి పాఠశాలలో సిబిఎస్ సిలబస్ అమలు చేసే విధంగా యాజమాన్యం దష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. సింగరేణిలో జరిగే మెడికల్ అవినీతిని అరికట్టేందుకు, దరఖాస్తు చేసుకున్న అర్హత కలిగిన ప్రతి కార్మికుని కొడుకులకు డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని ఆ దిశగా యాజమాన్య దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. కార్మికులు ఏదైతే ఎన్నికల్లో ఏఐటీయూసీ ఇచ్చిన హామీల, ప్రతి సమస్య పరిష్కారం కోసం సింగరేణి కాలర్స్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మిరియాల రంగయ్య, బ్రాంచ్ సెక్రటరీ మోట పలుకుల రమేష్, మాతంగి రామచందర్ గురుజేపల్లి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేగొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా పట్టెం కోటి





నవతెలంగాణ-రేగొండ

రేగొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా రేగొండ మండల కేంద్రానికి చెందిన వార్త రిపోర్టర్ పట్టెం కోటిలింగం, ప్రధాన కార్యదర్శిగా ఆకుల వెంకటేష్, ఉపాధ్యక్షులుగా బండి కమలాకర్, పల్నాటి రాజు, ఎన్నికయ్యారు. రేగొండ మండల కేంద్రంలోని ఉమ్మడి మండల కేంద్రానికి చెందిన రిపోర్టర్ల అధ్వర్యంలో ఆదివారం 11మంది సభ్యులతో కూడిన ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఎన్ను కున్నారు. గౌరవ అధ్యక్షులు నామాల రమేష్, కోశాధికారిగా మహమ్మద్. రహీమ్ పాషా, సహాయ కార్యదర్శిగా సుంకరి శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా అంబల రవీందర్, కార్యవర్గ సభ్యులుగా బత్తుల ఆనంద్, బోయిని రాజులు ఎన్నికయ్యారు. రేగొండ మండలానికి చెందిన 21మంది రిపోర్టర్లు ఓటు హక్కు వినియోగించుకొని ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, కటకం రాజు,అక్కల రమేష్, బొట్ల ప్రవీణ్, వెంగల రణదీర్, బండి సమ్మయ్య, మంతెన సురేష్, మంతెన్ మధు, గునిగంటి రాకేష్, మార్త రాజు, బండి శ్రీను, బత్తిని వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

48 డివిజన్ కాజీపేట్ దర్గా మసీదులో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ జిల్లా అనగానే మతసామరస్యానికి మారుపేరుగా ఐక్యతకు నిలయంగా ఉంటుందన్నారు. అందరం ఐకమత్యంగా మనిషి మనిషిని గౌరవిస్తూ ముందుకు వెళ్లాలని భవిష్యత్ తరాలకు కూడా ఈ సంప్రదాయాన్ని అందించాలని కుష్రుఉపాషా ప్రతి సంవత్సరం మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ వేడుకలను జరపాలని కోరారు. రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం నిష్ఠగా ఉపవాసం ఉంటారని అల్లా దయ అందరికీ ఉండాలని అందరిని చల్లగా చూడాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అజీజ్ ఖాన్, 48వ డివిజన్ మాజీ కార్పొరేటర్, అబూబక్కర్ ముస్లిం పెద్దలు కాంగ్రెస్ మైనార్టీ నాయకులు , డివిజన్ ప్రెసిడెంట్ సింగారపు రవి ,కాంగ్రెస్ నాయకులు కుమార్, చందు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని సన్మార్గం వైపు నడిపించే వారే నిజమైన గురువులు

సామాజిక సమరసత వేదిక అఖిలభారత కళా విభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

సమాజాన్ని సన్మార్గం వైపు నడిపించే వారే నిజమైన గురువులని ఆ కోవకు చెందిన వారిలో ఆముదాల దాత మహర్షి ముందు వరుసలో ఉంటారని సామాజిక సమరసత వేదిక అఖిలభారత కళా విభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు.తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షులు, ప్రభుత్వ అభ్యసన ప్రాథమికోన్నత పాఠశాల, లష్కర్ బజార్ ప్రధానోపాధ్యాయులు ఆముదాల దాత మహర్షి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం హనుమకొండ సామా జగన్మోహన్ స్మారక భవనంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. తపస్ జిల్లా అధ్యక్షులు బత్తిని వీరస్వామి గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా అప్పాల ప్రసాద్ పాల్గొని మాట్లాడారు.ఉద్యోగ విరమణ అంటే బాధ్యత మరింతగా పెరిగిందని అర్థం చేసుకోవాలన్నారు. సేవ, త్యాగం అని ధ్యేయ వాక్కులతో ఈ దేశం నడుస్తుందని ఉద్యోగ విరమణ పొందిన వారు ఈ దిశలో పయనించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ , సరస్వతి విద్యాపీఠం రాష్ట్ర సహకార దర్శి ఏ. చంద్రకాంత్ రెడ్డి , విద్యా భారతి దక్షిణ క్షేత్ర శిక్షణ ప్రముఖ్ రావుల సూర్యనారాయణ, గౌరవ అతిథిగా హనుమకొండ డిస్ట్రిక్ కోఆర్డినేటర్, క మ్యూనిటీ మొబిలైజేషన్ ఇంక్లూసి వ్ ఎడ్యుకేషన్, విశిష్ట అతిథులుగా హనుమకొండ ఎం.ఈ.ఓ ఎర్ర రామ్ కిషన్ రాజు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వరంగల్ విభాగ్ సంఘ చాలఖ్ ఆచార్య చిలకమారి సంజీవ, అతిథులుగా ములుగు జిల్లా బీసీ సంక్షేమ అధికారి చిట్టి రెడ్డి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా రెండోసారి శ్రీనివాస్‌నాయక్ నియామకం



నవతెలంగాణ-పర్వతగిరి

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మండలంలోని దేవిలాల్ తండాకు చెందిన జాటోత్ శ్రీనివాస్‌నాయక్ రెండోసారి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి నిరంతరం కషి చేస్తానని, అందరి సహకారంతో రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అధిక మెజారిటీతో విజయం సాధించడం కోసం కషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్‌గౌడ్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అనిల్‌రావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బోంపెల్లి దేవేందర్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, కుందూరు వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులకు, ఎంపీటీసీలకు, సొసైటీ డైరెక్టర్లకు, యువజన కాంగ్రెస్ నాయకులకు, గ్రామ పార్టీ అధ్యక్షులకు, పలు అనుబంధ సంఘాల అధ్యక్షులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



హిందుత్వం ముసుగులో మోడీ అరాచకాలు

రాహుల్ గాంధీతోనే దేశంలో మార్పు

దేశ సంపదలను అమ్ముకుంటున్న బీజేపీ ప్రభుత్వం

ప్రజా ద్రోహులు మోడీ కేసీఆర్

ఏఐసీసీ సభ్యుడు కత్తి వెంకటస్వామి

నవతెలంగాణ-గీసుగొండ

హిందుత్వ ముసుగులో దేశాన్ని దోచుకుంటుంటే ఊరుకునేది లేదని, రాజరికానికి ప్రజాస్వామ్యానికి జరిగే పోరాటంలో ప్రజాస్వామ్యం గెలుస్తుందని ఏఐసీసీ సభ్యులు కత్తి కత్తి వెంకటస్వామి అన్నారు. గీసుకొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ సభ్యుడు కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ మలి,తొలిదశ ఉద్యమాలలో ప్రొఫెసర్ జయశంకర్ తో పాల్గొనడం నా అదష్టమని ఆయన అన్నారు. తెలంగాణని ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణను ఆర్థికంగా బలోపేతం చేయబోయేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా సంపదనను కొల్లగొడుతూ ప్రజాద్రోహానికి పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో కేసీఆర్‌కి ఎలా గుణపాఠం చెప్పామో, అలాగే దేశంలో ప్రధాని మోడీకి కూడా అలాగే గుణపాఠమే చెప్పాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ముందుండి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకునే బాధ్యత ప్రతి కార్యకర్త పైన ఉందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి కోఆర్డినేటర్ గాదె దయాకర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య, కాంగ్రెస్ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి రావుల శ్రీనివాసరెడ్డి, పరకాల అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, జిల్లా నాయకులు కొండేటి కొమురా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-సంగెం

వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఆదివారం మండలంలోని నార్లవాయి, చింతలపల్లి గ్రామాల నుండి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ సర్పంచ్, మాజీ వార్డ్ సభ్యులు, టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పార్టీలోచేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నార్లవాయి గ్రామం నుండి ప్రస్తుత తాజా మాజీ సర్పంచ్ కోడూరి రజిత రమేష్, ఆకుల చినరాజు, ఆకుల లావణ్య, సింగిరెడ్డి శ్రీనివాస్, మొలుగురి కవిత, మొగిలి, మాదినేని పరమేష్, ఆకుల నాగరాజు, చిన్న పెళ్లి సారయ్య, తాడెం పద్మ, శ్రీనివాస్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. చింతలపల్లి గ్రామం నుండి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇండ్ల శ్రీనివాస్ అధ్వర్యంలో బీ ఆర్ ఎస్ పార్టీ నుండి కొప్పుల రమేష్, దాసరి రమేష్, ధరావత్ రాజు, బానోత్ మోహన్ నాయక్ ,దాసరి కళ్యాణి తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు కత్తి వెంకటస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి జనగాం రమేష్, మాజీ సర్పంచ్ ఇండ్ల రవికుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



లోక రక్షకుడు ఏసుక్రీస్తు

బిషప్ కుడుముల బాల

నవతెలంగాణ-ధర్మసాగర్

లోక రక్షకుడు ఏసుక్రీస్తు అని, మానవుల పాపాల కోసం రక్షణ ప్రసాదించిన ఉత్తన్న క్రీస్తు ప్రభువు ఆశీస్సులు అందరిపై ఉండాలని వరంగల్ మేత్రాణులు కుడుముల బాల అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సిలువ గుట్టపై విచారణ ఫాదర్ జోసెఫ్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగ వేడుకలను నిర్వహించగా ముఖ్యఅతిథిగా అయన పాల్గొని ప్రసంగించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆదాము ఏవమ్మా పాపల రక్షణార్థము తండ్రి దేవుడు యేసు క్రీస్తుని ఈ లోకానికి మానవ రూపంలో పంపించారని ఆయన చిందించిన రక్తముతో మానవుడు చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం నీ చెల్లించి ప్రజలందరిని పరలోక వారసులుగా చేశారన్నారు.ఉత్తన్న క్రీస్తు ప్రభువు దీవెనలు ప్రతి ఒక్కరి పైన ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తన క్రీస్తు ప్రభువు కేకు కట్ చేశారు. అనంతరం విచారణలోని సంఘ పెద్దలు పాటల బంద సభ్యులు ఆయనను శాలువాలతో పుష్పగుచ్చాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఫాదర్ మాచర్ల నవీన్, ఉపదేశకులు కమలాకర్, సంఘ పెద్దలు మాచర్ల ప్రవీణ్, పళ్ళు మారి చిరంజీవి, కొట్టే శ్రీనివాస్, కొట్టే గణేష్,రాజన్ బాబు, ఏలియా ప్రభుదాస్, విశ్వాసులు సంఘస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

నవతెలంగాణ-శాయంపేట

మండల పరిధిలోని గ్రామాలలోని క్రైస్తవ మందిరాలలో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్తగట్టు సింగారం గ్రామంలోని దివ్య బాల యేసు దేవాలయంలో యేసుక్రీస్తు పునరుత్తరన పండుగను పాస్టర్ గంగారపు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తి గీతాలు ఆలపించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.